RNI Reg-No.APTEL/2005/19204

ESTD : 1996

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

సంపుటి :21 సంచిక 93 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి శనివారం 4-4-2026 పేజీలు :8 వెల: 1-00

https://netimanadesam.com/

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత రుతువు, చైత్ర మాసం, తిథి॥విదియ ఉ॥8.30, స్వాతి రా ॥8.12, వర్జ్యం రా॥2.20-4.05, దుర్ముహూర్తం ఉ॥ 5.57-7.34, శుభ సమయం ఉ॥ 6.00-7.30, రాహుకాలం ఉ॥9.00-10.30, సూర్యోదయం ఉ॥ 5.59, సూర్యాస్తమయం సా॥ 6.08 గం॥

## మరో మూడు రోజులు పార్లమెంట్

-16 నుంచి తిరిగి సమావేశాలు ప్రారంభం

-మహిళా రిజర్వేషన్, ఎఫ్‌సిఆర్‌ఎ సవరణ 6లో

## నేటి నుంచి రబీ ధాన్యం కొనుగోళ్లు


❑రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,917 కొనుగోలు కేంద్రాలు

❑వెల్లడించిన పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల



**కాకినాడ, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతులకు శుభవార్త చెప్పింది.. నేటి నుంచి రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలియజేశారు.. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,917 కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఇక, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేస్తామని మంత్రి నాదెండ్ల స్పష్టం చేశారు. రైతులు తమ పంటకు సరైన ధర పొందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ధాన్యం నిల్వ మరియు రవాణా విషయంలో కూడా ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేసింది.

మొత్తం 5.40 కోట్ల గోతాలను సిద్ధం చేసినట్లు, గోతాల కొరత రాకుండా మిల్లర్లతో ఇప్పటికే చర్చలు జరిపినట్లు తెలిపారు. అలాగే ధాన్యం రవాణా కోసం 17,200 లారీలను జీపీఎస్ సదుపాయంతో సిద్ధం చేసినట్లు వెల్లడించారు. మొత్తంగా, ఈసారి రబీ ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా, వేగంగా జరిగేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.





# అమరావతిని నాశనం చేయాలని చూస్తే శాసనం చేశాం

### మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు

**అమరావతి, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలపడం ప్రజా విజయమని.. ఇది ప్రజా రాజధానికి దక్కిన గౌరవమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఈ బిల్లుకు వైకాపా మినహా అన్ని పార్టీలూ మద్దతు తెలిపాయని చెప్పారు. ఉండవల్లిలోని తన నివాసంలో మిగతా 2లో..

## అప్పుడు వారు నాలుగు పెళ్లిళ్లు చేసుకోలేరు

-సివిల్‌కోడ్‌పై అమిత్‌షా



**గోల్‌పాడా, ఏప్రిల్ 3 (ఆర్‌ఎన్‌ఎ):** అస్సాం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాజపా అగ్ర నేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొన్నారు. గోల్‌పాడా జిల్లాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో కీలక వ్యాఖ్యలు చేశారు. చొరబాటుదారులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోకుండా ఉమ్మడి పౌరస్మృతి ద్వారా అడ్డుకునే వీలు ఉంటుందన్నారు. "ఆదివాసీల అభివృద్ధి కోసం ప్రధాని మోదీ, అస్సాం ముఖ్యమంత్రి రోడ్ మ్యాప్ సిద్ధం చేశారు. మోదీ నాయకత్వంలో ఆదివాసీ మహిళ దేశ ప్రథమ పౌరురాలు అయ్యారు" అని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో యూసీసీని బలవంతంగా రుద్దుతారంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని ఆయన తిప్పికొట్టారు. ఈ సందర్భంగా ఇటీవల మేఘాలయలో తలెత్తిన ఉద్రిక్తతలను ప్రస్తావించారు. చొరబాటుదారులు అక్కడి మిగతా 2లో..

## ఇరిగేషన్ అధికారులు తీరు మార్చుకోవాలి

■గత ప్రభుత్వంలో లాగా చేస్తామంటే కుదరదు

■సిఈలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి నిమ్మల రామానాయుడు



**అమరావతి, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గతంలో ప్రభుత్వంలో వ్యవహరించినట్లుగా కాకుండా, ఇరిగేషన్ అధికారులు తీరు మార్చుకోవాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరించారు . శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సిఈలతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడిన మంత్రి నిమ్మల నియోజకవర్గాల వారీగా కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, పూడికతీత, వంటి పనులకు సంబందించిన అంచనాల తయారీపై సమీక్ష నిర్వహించారు. ఆయా పనులకు సంబందించి మార్చి 25వ తేదీలోపు నియోజకవర్గాల వారీగా అంచనాలు రూపొందించి పంపించాలని ఆదేశించినా, ఇప్పటివరకు కొంత మంది చీఫ్ ఇంజనీర్లు సరిగా అంచనాలు సమర్పించకపోవడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, మట్టి మిగతా 2లో..

## డిప్రెషన్‌లో జగన్.. అందుకే 'మావిగన్' వ్యాఖ్యలు

-భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



**అమరావతి, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అసెంబ్లీ ఎన్నికల ఓటమి అనంతరం వైకాపా అధినేత జగన్ మానసిక స్థితి సరిగా లేదని భాజపా ఏపీ అధ్యక్షుడు మాధవ్ అన్నారు. రాష్ట్రాభివృద్ధి, అమరావతికి చట్టబద్ధత చూసి జగన్ డిప్రెషన్‌లోకి వెళ్లారని విమర్శించారు. రాజధాని అంశంలో అర్థం లేకుండా జగన్ 'మావిగన్' అని మాట్లాడటానికి ఇది పరాకాష్ఠ అన్నారు. పార్లమెంట్‌లో అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదానికి సహకరించిన వారికి మాధవ్ ధన్యవాదాలు తెలిపారు.

## మరోమారు నోరు పారేసుకున్న ఖవాజా

-భారత్ దాడులు చేస్తే బుద్ధి చెబుతామని హెచ్చరిక



**ఇస్లామాబాద్, ఏప్రిల్ 3 (ఆర్‌ఎన్‌ఎ):** పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. పహల్గాం దాడి జరిగి ఏడాది కావస్తున్న నేపథ్యంలో భారత్ తమపై బెదిరింపులకు పాల్పడు తోందని ఆరోపించారు. ఇవన్నీ చూస్తుంటే వారు తమపై దాడులకు ప్రణాళికలు రచిస్తూ. .రెచ్చగొట్టడానికి ప్రయత్ని స్తున్నట్లు అనిపిస్తోందన్నారు. మరోసారి తమతో ఘర్షణకు దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తమపై జరిగే దాడులను వేగవంతమైన, ప్రణాళికాబద్ధమైన ప్రతిస్పందనతో మిగతా 2లో..

## మారిన వాతావరణం

●పలు జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం

●ఈదురుగాలులు కూడా ఉంటాయని హెచ్చరిక



**అమరావతి, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అత్యవసర హెచ్చరిక జారీ చేసింది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, పోలవరం జిల్లాల్లో వర్ష ప్రభావం ఎక్కువగా ఉండనుందని, ఆయా జిల్లాల యంత్రాంగం ఇప్పటికే అప్రమత్తమైంది.వర్షంతో పాటు గంటకు 40 నుండి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే మిగతా 2లో..

## ఎమ్మెల్యే అరవింద్ బాబుపై సిఎం సీరియస్

-పార్టీ కార్యాలయంలో చర్చించిన అధ్యక్షుడు పల్లా



**అమరావతి, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పల్నాడు జిల్లా నరసరావుపేట ఎమ్మెల్యే అరవింద బాబుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. పార్టీ పరువుకు భంగం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇటీవల తాను చెప్పిన వ్యక్తికి లీగల్ అడ్వైజర్ పోస్ట్ ఇవ్వలేదని అరవింద బాబు హల్ చల్ చేశారు. ఏకంగా పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో బైఠాయించి నిరసన తెలిపారు. ఈ విషయం కాస్తా పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్లింది. ఎమ్మెల్యేతో మాట్లాడాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి అరవింద బాబును పల్లా శ్రీనివాసరావు పిలిపించారు. ఎస్పీ కార్యాలయంలో బైఠాయించడంపై వివరణ కోరారు. ఘటనపై టీడీపీ అధినేత చంద్రబాబు అసంతృప్తిగా ఉన్నారని.. ఇది ఎంతమాత్రం సహించరాని విషయమని అరవింద బాబుకు పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. లీగల్ అడ్వైజర్ నియామకం జరగకపోతే పార్టీ జిల్లా అధ్యక్షుడు, రీజనల్ కోఆర్డినేటర్ లేదా తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. అంతేకాని ఇలా పార్టీ పరువుపోయేలా ప్రవర్తించడం ఏంటని నిలదీశారు. సందర్భంగా ఎస్పీ కార్యాలయంలో బైఠాయించడం, పార్టీ పరువుకు భంగం కలిగించే ప్రయత్నాలను ఖండించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే పార్టీ తరఫున తీవ్ర చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని తేల్చిచెప్పారు. అయితే, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూసుకుంటానని ఎమ్మెల్యే అరవింద బాబు హామీ ఇచ్చారు.

## శత్రువుకు చిక్కని 'తారాగిరి'.. నేవీలోకి మరో యుద్ధనౌక




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (ఆర్‌ఎన్‌ఎ):** భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరింది. అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' శుక్రవారం జలప్రవేశం చేసింది. విశాఖ నేవల్ డాక్ యార్డులో జరిగిన కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా దీన్ని కమిషన్ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీఎస్ జనరల్ అనిల్ చౌహన్, నౌకాదళ అధిపతి దినేశ్ కె.త్రిపాఠి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్టెల్త్ సాంకేతికతతో రూపొందించిన ఈ ఫ్రిగేట్ భారత సముద్ర సరిహద్దు రక్షణలో కీలక పాత్ర మిగతా 2లో..

మన పాపాలకు కారణం మనం ఇతరులకన్నా ఉన్నతంగా ఉండాలనే స్వార్థపు కోరికలే. పాపం అనేది ఏదైనా ఉంటే ఇది ఒక్కటే - నీవు దుర్బలుడవని లేదా ఇతరులు దుర్బలురని అనడం.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# ట్రంప్‌కు జ్ఞానోదయం అయ్యేనా?

పిల్లికి చెలగాటం.. ఎలుకకు ప్రాణ సంకటం అన్న చందంగా ఇప్పుడు అమెరికా, ఇరాన్‌ల యుద్ధం తయారయ్యింది. ప్రపంచం అతలాకుతలం అవుతున్నా.. ఇరాన్ కోలుకోలేకుండా చేయడమే లక్ష్యంగా ట్రంప్ మూర్ఖంగా ముందుకు సాగుతున్నారు. ట్రంప్ ఏం మాట్లాడుతున్నారో తెలియడం లేదు. ఇంటాబయటా నిరసనలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నా పట్టించుకోవడం లేదు. ఇకముందు ప్రపంచంలో ఇంధన కొరత తీవ్ర రూపం దాల్చడం ఖాయంగా కనిపిస్తుంది. ఇంధన కొరత అన్ని దేశాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. దీనిగురించి ట్రంప్‌కు పెద్దగా బెంగ లేదు. ప్రజలు ఏమయితే ఏమిటన్న ధోరణిలో ఆయన యుద్ధాన్ని ప్రేరేపించారు. ప్రపంచంలో ఏ దేశంలో ఏమి జరిగినా అది మన ఇంట్లో పొయ్యిలో పిల్లి లేవాలా వద్దా అన్నంత ప్రభావం చూపుతోంది. ఇప్పటికే మనదేశంలో హోటల్ పరిశ్రమ కుదేలయ్యింది. ఇలాగే యుద్ధం కొనసాగితే దాని ప్రభావం ఎన్నాళ్లు ఉంటుందో చెప్పలేం.ఎందుకంటే యుద్ధం మొదలు పెట్టి ఇరాన్÷–ను దెబ్బతీసినందుకు గాను ఇరాన్ కూడా గట్టిగానే ఎదురిస్తోంది. అంతు చూస్తామని అమెరికాను హెచ్చరి స్తోంది. తమకు నాలుగు వేల కిలోమీటర్ల దూరంలోని డిగో గార్షియా మీద ఇరాన్ చేసిన దాడిని తక్కువగా అంచనా వేయటం తగదని అమెరికా పూర్వ అధ్యక్షుడు బిల్ క్లింటన్ ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్‌కు హితవు పలుకుతున్నాడంటే ఇక పైనైనా ఆచితూచి నిర్ణయం తీసుకోవాల్సిన ఆవశ్యకతను చెప్పడమే! అత్యంత అధునాతన ఎఫ్ 35 యుద్ధ విమానంపై ఇరాన్ దాడి చేసిందన్న వార్త ప్రపంచ దేశాలను ఉలికిపాటుకు గురిచేసింది. యుద్ధ తంత్ర నిపుణులు ఇరాన్ బలిమి లెక్కింపులో అమెరికా వ్యూహాన్ని తప్పుపట్టారు. తాజా వ్యూహంలో హర్మూజ్ జలసంధి ఇరాన్ పట్టు సడలించేందుకు ట్రంపు నానా యాతన పడుతున్నారు. అది సాధ్యం కావడం లేదు. ఇరాన్ తో సత్సంబంధాలు నెరపుతున్న భారత్ వంటి దేశాల నౌకలకే సేఫ్ ప్యాసేజ్ లభించింది. అయినా ప్రపంచవ్యాప్తంగా ఉన్న చమురు సంక్షోభంలో భారత్ కూడా చిక్కుకోక తప్పడంలేదు. కొన్ని నౌకలు భారతీయ పోర్టులకు చేరినా దేశవ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తుల కొరత బ్లాక్ మార్కెట్, రవాణా వాహనాలు చార్జీలు పెంపు వంటి అంశాల నుంచి ఎప్పటికి సాధారణ స్థాయికి చేరుకుంటుందో చెప్పలేం. హర్మూజ్ జలసంధి ఇరాన్ పట్టు నుంచి తప్పించడానికి వెళ్తున్న యుద్ధ విమానాలకు శ్రీలంక అనుమతి నీయకపోవడంతో అమెరికా ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. హర్మూజ్ పై సైనిక చర్యకు ముందుకు రాని నాటో కూటమి దేశాలతో, తమ భద్రతను తామే ఏర్పాటు చేసుకోవాలని ట్రంప్ చేతులెత్తేశారు. ఆయన నిర్ణయాలకు మిత్ర దేశాల వత్తాసు లభించడం లేదు. ఇరాన్ వార్ కారణంగా ఖతార్ ఎల్ఎన్జి ఎగుమతులకు 5 ఏళ్ల పాటు దారి దొరికే పరిస్థితి లేదని తేలిపోయింది. ఇరాన్, అమెరికా ఇజ్రాయిల్ యుద్ధం మానవ రహిత కార్యాచరణగా సాగుతోంది. కేవలం ఆయా దేశాల మౌలిక వనరుల విచ్ఛిత్తి పైనే దాడిగా చెప్పుకోవాలి. నెల రోజులుగా జరుగుతున్న యుద్ధాన్ని విశ్లేషిస్తున్న వారెవరైనా ఈ యుద్ధం ఆగేందుకు దారి లేదని, ఆపేందుకు ఎవరూ ముందుకు రావడంలేదని వారి వైఖరులే స్పష్టపరుస్తున్నాయి. తాజాగా ఇరాన్ అమెరికా ఉద్రిక్తతలు హిందూ మహా సముద్రానికి విస్తరించాయి. అమెరికా వ్యూహాత్మక సైనిక స్థావరం డిగో గారియాను ఇరాన్ లక్ష్యం చేసుకోవడంతో అమెరికాలో కలవరం బయలుదేరింది. ఇరాన్ వద్ద ఇలాంటి శక్తివం తమైన బాంబులున్నట్లు అంచనా వేయడంలో అమెరికా దాదాపు విఫలమైనట్లే. ఇప్పుడు అమెరికా ఆత్మరక్షణలో పడిపోయింది. అయినా ట్రంప్ తన అహంకారాన్ని వీడడం లేదు. యురేనియం శుద్ధి చేసే సామర్థ్యం ఇరాన్‌కు లేదని, అలాగే బాలిస్టిక్ క్షిపణులు తయారు చేసే సామర్థ్యం కూడా లేకుండా చేసి తాము విజయం సాధించినట్లేనని ఈ మధ్యనే ఇజ్రాయిల్ ప్రధాని బెంజి మెన్ నెతన్యాహు ఒక సందర్భంలో సంతృప్తి వ్యక్తం చేశారు. ఇరాన్‌ను అణ్వస్త్ర తయారీ వరకు వెళ్లకుండా చేయడమే తమ అంతిమ లక్ష్య మని అమెరికా ఇజ్రాయిల్ ప్రకటించుకున్నాయి. అదే నిజమైతే ఇప్పుడు వాళ్ళు ఆ దిశగా విజయం సాధించినట్లే. ఇజ్రాయిల్ లక్ష్యం అదే అయినప్పుడు మరికొంత కాలం యుద్ధాన్ని సాగతీయడం ఉభయులకూ, ఈ ప్రపంచానికీ మంచిది కాదు. టెహ్రాన్‌పై అమెరికా– ఇజ్రాయిల్ సంయుక్తంగా చేపట్టిన యుద్ధం 34వ రోజుకు చేరుకుంది. ఇరుదేశాల పరస్పర దాడుల వల్ల పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఇస్లామిక్ రిపబ్లిక్‌పై అమెరికా జరిపే ఏ భూతల దాడినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాగేర్ గాలిబాఫ్ ప్రకటించారు. ఇందుకోసం 7 మిలియన్ల ఇరానీయులు సిద్ధంగా ఉన్నారని ప్రకటించారు. అమెరికాతో సంప్రదింపుల భాగస్వామిగా పేరు వినిపిస్తున్న మహమ్మద్ బఘేర్ ఖాలిబాఫ్, యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి అమెరికాకు సవాలు విసురుతూ వరుసగా ఆన్‌లైన్ పోస్టులు పెడుతున్నారు. అమెరికా– ఇజ్రాయిల్ తమపై అకారణంగా దాడులు చేస్తున్నాయని ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడుల కారణంగా దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను తిరిగి పునరుద్ధరించడానికి నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇందుకోసం దేశవ్యాప్త కార్యక్రమం చేపట్టాలని నిర్దేశించారు. అమెరికా– ఇజ్రాయిల్ తమ దేశంపై కొనసాగిస్తోన్న నీచమైన, దురాక్రమణ దాడులను మొజ్తాబా తీవ్రంగా ఖండించారు. ఇరాన్ అభివద్ధిని విస్తరించడం, ఉజ్వల భవిష్యత్తుకు ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మొత్తంగా అమెరికాను ఎదిరించే సాహసం ఇరాన్ చేస్తోంది. ఇది అమెరికాకు ముఖ్యంగా ట్రంప్‌కు గుణపాఠం కావాలి.

# భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం

### అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' జలప్రవేశం

### విశాఖలో ప్రారంభించిన కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



**విశాఖపట్నం, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరింది. అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' శుక్రవారం జలప్రవేశం చేసింది. విశాఖ నేవల్ డాక్ యార్డులో జరిగిన కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా దీన్ని కమిషన్ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీఎస్ జనరల్ అనిల్ చౌహన్, నౌకాదళ అధిపతి దినేశ్ కె.త్రిపాఠి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్టెల్త్ సాంకేతికతతో రూపొందించిన ఈ ఫ్రిగేట్ భారత సముద్ర సరిహద్దు రక్షణలో కీలక పాత్ర పోషించనుంది. నీలగిరి శ్రేణి 17–ఏలో నాలుగో ప్రాజెక్టుగా ఈ యుద్ధనౌకను ముంబయిలోని మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్)లో నిర్మించారు. స్వదేశీ ఆధునిక సాంకేతికత వినియోగంలో 75 శాతానికిపైగా సూక్ష్మ,చిన్న మధ్య తరహా పారిశ్రామిక రక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థలు భాగస్వామ్యం అయినట్లు నేవీ (ఎనిటతిజీని ఔజీలా) వర్గాలు పేర్కొన్నాయి. శత్రువుల రాడార్‌లకు కనిపించకుండా పనిచేసే సామర్థ్యం ఈ వార్‌షిప్ ప్రత్యేకత. ఐఎన్ఎస్ తారాగిరిని గతేడాది నవంబరు 28న నేవీకి అప్పగించారు. 149 మీటర్ల పొడవు, 17.8 మీటర్ల వెడల్పుతో 6,670 టన్నుల బరువుండే ఐఎన్ఎస్ తారాగిరి కంబైన్డ్ డీజిల్/గ్యాస్ ఆధారిత ప్లాంటుతో సముద్ర జలాల్లో గంటకు 28 నాట్స్ వేగంతో ప్రయాణించగలదు. ఇందులో నిశ్శబ్ద ఫిరంగులతో కూడిన ఆధునిక టెక్నాలజీ ఉంది. బరాక్–8 వంటి విమాన విధ్వంసక, 8 బ్రహ్మోస్ నౌకా విధ్వంసక క్షిపణులు ఇందులో ఉన్నాయి. యాంటీ సబ్‌మెరైన్ వార్ఫేర్ వ్యవస్థతోపాటు, శత్రువుల జాడను, ముప్పును ముందే పసిగట్టే రాడార్ వ్యవస్థ ఉంది.అరిదమన్ అనేది ఒక పదం కాదని.. ఒక శక్తి అని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు. భారత్ మూడో స్వదేశీ అణు సబ్‌మెరైన్ అరిదమన్ అని తెలిపారు. దీంతో సముద్ర ఆధారిత అణు నిరోధకశక్తి మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో పని చేస్తున్న నావెల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లెబోరెటరీ (ఎన్ఎస్‌టీఎల్)ను రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. అందులోని కావిటేషన్ టన్నెల్‌కు సైతం ఆయన శంకుస్థాపన చేశారు. 2016లో ఐఎన్ఎస్ అరిహంత్, 2024 ఆగస్టులో ఐఎన్ఎస్ అరిఘాట్‌ల సరసన తాజాగా ఐఎన్ఎస్ అరిదమన్ చేరింది. అరిదమన్ చేరికతో.. అణుశక్తితో నడిచే బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గాములను సొంతంగా నిర్మించి, నిర్వహిస్తున్న అగ్రరాజ్యాలు అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా వంటి ఎంపిక చేసిన దేశాల క్లబ్‌లో భారత్ చేరింది. ఈ జలాంతర్గాములు శత్రువుల కంటపడకుండా నెలల తరబడి సముద్రగర్భంలో ఉంటాయి. శత్రు దేశాల నుంచి అణు దాడి జరిగితే.. సముద్రం లోపలి నుంచే దీటుగా ఇవి బదులిస్తాయి.

# బైక్‌ను బలంగా ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

### ముగ్గురు యువకుల దుర్మరణం



**అనకాపల్లి, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అనకాపల్లి జిల్లాలో అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఎలమంచిలి మండలం పోతిరెడ్డిపాలెం జంక్షన్ వద్ద రాత్రి 12 గంటల ప్రాంతంలో ద్విచక్ర వాహనాన్ని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు అనకాపల్లికి తరలిస్తుండగా చనిపోయారు. మృతి చెందిన ముగ్గురు యువకులు ఎలమంచిలి మండలం పురుషోత్తపురం గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. మృతులు బంగారు నాని(24), గోవిందు (25) , పోతిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన బంగారి దుర్గాప్రసాద్(16)గా గుర్తించారు. మృతుల్లో ఇద్దరు పెయింటింగ్ పనులు చేసుకోగా, మరో యువకుడు చదువుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యువకుల మృతి సమాచారాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## మచిలీపట్నం ఘటనలో పోలీసులు తీరు దారుణం

### మాజీమంత్రి పేర్నినాని ఘాటు విమర్శలు

**మచిలీపట్నం, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మచిలీపట్నం కొబ్బరితోటలో అక్రమ నిర్మాణాల కూల్చివేత ఘటనలో పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే కారణంగా రాష్ట్ర మాజీ మంత్రి పేర్ని నానిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన సంగతి తెలిసిందే. అయితే.. దీనిపై పేర్ని నాని స్పందించారు. గురువారం జరిగిన ఈ ఘటనపై జిల్లా పోలీస్ అధికార సంఘం అధినేత జయపాల్.. ప్రెస్‌మీట్లో మాట్లాడిన విధానాన్ని తప్పుబట్టారు. నిన్న జరిగిన సంఘటనకు సంబంధించిన వీడియోను చూసి జయపాల్ మాట్లాడిఉంటే బాగుండేది. అక్కడ జరిగిన సంఘటన ఏమిటి? ఆయన ప్రెస్ మీట్లో మాట్లాడిందేమిటి.? వైసీపీ తరఫున శాసనసభ ఎన్నికల్లో పోటీచేసిన వ్యక్తి పేర్ని కిట్టు. ఆయనతో పాటు కార్పొరేటర్లు వచ్చి అండగా నిలబడ్డారు. గత ప్రభుత్వంలో ఏ పేదవాని ఇంటినీ మేం కూల్చలేదు. కానీ మున్సిపల్ అధికారులు ఇప్పుడు కొబ్బరితోటలను కూల్చడం ప్రారంభించారు. గౌరవం ఇచ్చిపుచ్చుకోవాలని తెలిపారు.. బాగుంది. కానీ అక్కడ ఏం జరిగిందో జయపాల్ తెలుసుకోకుండా.. బాడీ షేమింగ్ చేశారని ఎలా మాట్లాడారు? అసలు ఆ సీఐని మేమెక్కడా ఉదహ రించలేదు. ఆయన పేరుతో ఏమీ అనలేదు. అయినా ఏకవచనంతో మీరు మాట్లాడవచ్చా?' అని పేర్ని నాని ప్రశ్నించారు. నా మీద, నా కొడుకు మీద అక్రమ కేసులు కట్టారు. కేవలం పబ్లిసిటీ కోసం ఎవరు ఎదిగారు? ఎవరు ఆరాటపడుతున్నారు? జయపాల్.. నాకు రాజకీయ పబ్లిసిటీ దేనికి? నేను ప్రజలకోసం పోరాటంచేసే వ్యక్తిని? కొందరు పోలీసులు భయంలేకుండా తప్పులు చేస్తున్నారు. మీలా అందరూ మంచి వ్యక్తులు లేరు. పోలీస్ వ్యవస్థ మారింది. పోలీసులు మిమ్మల్ని స్ఫూర్తిగా తీసుకుని పనిచేస్తే అప్పుడు ప్రజలకు పోలీసులతో అవసరమేమీ ఉండదుగా.!' అని వ్యాఖ్యానించారు మాజీ మంత్రి. రెడ్‌బుక్ రాజ్యాంగం రాగానే పామర్రులో ఓ అధికారికి ఎందుకు పోస్టింగ్ ఇచ్చారని ప్రశ్నించిన ఆయన.. ఆ తర్వాత మళ్లీ నాలుగు జిల్లాల అవతలికి ఎందుకు పంపారన్నారు. పోలీస్ వ్యవస్థలో తప్పుచేసిన కొందరు అధికారులను ప్రశ్నించడం తప్పా అని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు పేర్ని నాని. మంత్రి కొల్లు రవీంద్ర ఎన్నోసార్లు పోలీస్ అధికారులను తిట్టారుగా.? అప్పుడీ పోలీస్ జిల్లాధ్య క్షుడికి(జయపాల్‌ను ఉద్దేశించి) కనపించలేదా.? మరప్పుడెందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. 'పోలీసులు సుదీర్ఘ కాలం పనిచేస్తారు. కానీ ఎక్కడా ఎక్కువ కాలం ఉండరు. పవిత్రమైన యూనిఫామ్ వెనుక తప్పుచేసే అధికారిని మాత్రమే మేం ప్రశ్నించాం. అంతేతప్ప నేనెప్పు డూ ఏ పోలీస్ అధికారినీ ఉద్దేశపూర్వకంగా అనలేదు. తప్పుచేసే వ్యక్తులను నిలదీయడం మా దృష్టిలో తప్పా?' అని చెప్పుకొచ్చారు.

## రాజధాని చారిత్రాత్మక నిర్ణయం

### బీజేపీ నాయకులు

**మచిలీపట్నం, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజధానిగా అమరావతి పై నిర్ణయాన్ని పార్లమెంట్లో ఏకగ్రీవం చేయడాన్ని స్వాగతిస్తూ పట్టణ బిజెపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాజధానిగా పార్లమెంటు ఉభయ సభలు పూర్తిగా సమర్థిస్తూ ఓటింగ్ చేయడం చారిత్రాత్మక నిర్ణయమని బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలకు సంతోషాన్ని కలిగించే ఏకగ్రీవ నిర్ణయాన్ని పార్లమెంటు ఉభయ సభ సభ్యులు తీసుకోవడం పట్ల ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి రాష్ట్ర ప్రజల సంక్షేమానికి మోడీ ప్రభుత్వం పరిపూర్ణ యొక్క చిత్తశుద్ధిని తెలియజేస్తుందని నాయకులు పేర్కొన్నారు.ఊరి అందరిదీ ఒక దారిని, ఉలిపి కట్టెది వేరొక దారి లాగా వైసిపి పార్టీ ఒకటే పార్లమెంటు వాకౌట్ చేయడం అనేది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పట్ల రాష్ట్ర ప్రజల సంక్షేమం పట్ల వైసిపి వారికి ఏమాత్రం ఇష్టం లేదని వారిది కపట ప్రేమని , రాష్ట్రాన్ని దోచుకోవడమే వారి లక్ష్యమని రాష్ట్ర ప్రజలు గ్రహించాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ కు రాజధానిగా అమరావతి పట్ల తీవ్ర వ్యతిరేకతయున్న వైసిపి పార్టీకి రాష్ట్ర ప్రజలు భవిష్యత్తులో ఏ మాత్రం అవకాశం ఇవ్వ రాదని బిజెపి నాయకులు పేర్కొన్నారు కూనప రెడ్డి ట్రస్ట్ లో జరిగిన ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కూనపరెడ్డి శ్రీనివాస్, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, సూరి శెట్టి హరికృష్ణ, వెన్నాఫణి రాజ్, విన్నకోట సుబ్బారావు, జుజ్జురి ప్రసాదు జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ పెన్షనర్ల బకాయిలను విడుదల చేస్తున్నందుకు సీఎంకి ధన్యవాదాలు తెలిపిన ఏపీఎన్జీ జీవోలు

**మచిలీపట్నం, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీ ఎన్జీ జీవోస్ అసోసియేషన్ కృష్ణా జిల్లా అధ్యక్షులు అకూరి శ్రీనివాసరావ కార్యదర్శి సీతారామయ్య, శుక్రవారం జరిగిన ప్రెస్ మీట్లో మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధాని గా అమరావతిని చట్టబద్ధత గుర్తింపు కల్పించే బిల్లు పార్లమెంట్లో ఆమోదం పొందడం గర్వకారణంగా భావిస్తున్నాం అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు మరియు పదవీ విరమణ పొందిన పొందిన ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ చెల్లింపుల కోసం మొత్తం 70 59 కోట్లు విడుదలకు ఆమోదం తెలిపినందుకు 184 7.83 కోట్లు జనరల్ ప్రావిడెంట్ ఫండ్ 3411.03 కోట్లు గ్రాట్యూటీ బకాయిలు 1800 కోట్లు పదవి విరమణ పొందిన ఉద్యోగుల లీవెన్కేష్మెంట్ నిమిత్తం222.47 కోట్లు పోలీస్ సిబ్బందికి అదనపు సరెండర్ లీవ్ చెల్లింపు అలాగే జిపిఎఫ్ కింద 1847.83 కోట్లు అలాగే గ్రూప్ ఇన్సూరెన్స్ ఇప్పటికే విడుదల చేసినారు ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సానుకూలంగా స్పందించినందుకు పెండింగ్ లో ఉన్న ఆర్థిక అంశాలపై త్వరలో పరిష్కరిస్తామని ముఖ్యమంత్రివర్యులు హామీ ఇచ్చినారు పై అన్ని విషయాలను పరిష్కారం కొరకు ప్రభుత్వ పెద్దలతో పలుమార్లు మాట్లాడి ఉద్యోగులకు రావలసిన బకాయిలను విడుదల చేస్తున్నందుకు రాష్ట్ర ఏపీ ఎన్జీ జీవోస్ అసోసియేషన్ అధ్యక్షులు అలపర్తి విద్యా సాగర్ ప్రధాన కార్యదర్శి డి వి రమణ కి కృష్ణా జిల్లా తరుపున ఏపీ ఎన్జీ జీవోలు అభినందనలు కృతజ్ఞతలు తెలియజేసారు. ట్రెజరర్ శోభన్ బాబు,మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఒక్కొక్క సమస్యను పరిష్కరిస్తున్నందుకు ఏపీ ఎన్జీ జీవోస్ రాష్ట్ర అధ్యక్షులు ఏ. విద్యాసాగర్ కి, ప్రధాన కార్యదర్శులు, రమణ కి,ఉద్యోగ సమస్యల పై సత్వరమే పరిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు కి, ధన్యవాదములు తెలియజేసారు. ఆర్గనైసింగ్ సెక్రటరీ హేమ ప్రకాష్, మచిలీపట్నం టౌన్ అధ్యక్షులు లక్ష్మి శ్రీనివాసరావు, కార్యదర్శి,శ్రీధర్, దీపక్, రమేష్, మరియు మహిళా వింగ్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ , అకూరి రమాదేవి,టౌన్ కన్వీనర్ జరీనా, వైస్ ప్రెసిడెంట్, జాహురున్నిసా బేగం, ఏ.రాధిక, అనిత కుమారి, ఏ. విజయ గౌరీ, సుదీప్తిలు పాల్గొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

## అప్పుడు వారు నాలుగు పెళ్లిళ్లు చేసుకోలేరు

ఆదివాసీ మహిళలను వివాహం చేసుకోవడం ద్వారా రాజకీయ పలుకుబడిని సంపాదించడానికి ప్రయత్నించారని, ఇది ఉద్రిక్తతలకు దారితీసిందని ఆయన ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే.. అక్రమ చొరబాట్ల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. "అస్సాంలో మాకు మరో ఐదేళ్ల సమయం ఇవ్వండి. రాష్ట్రానికి చొరబాటుదారుల నుంచి విముక్తి కల్పించేలా చర్యలు తీసుకుంటాం. అస్సాంలో యూసీసీని అమలు చేస్తాం. దాంతో చొరబాటుదారులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోలేరు" అని వెల్లడించారు.

## శత్రువుకు చిక్కని 'తారాగిరి'.. నేవీలోకి మరో యుద్ధనౌక

పోషించనుంది. నీలగిరి శ్రేణి 17–ఏలో నాలుగో ప్రాజెక్టుగా ఈ యుద్ధనౌకను ముంబయిలోని మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్)లో నిర్మించారు. స్వదేశీ ఆధునిక సాంకేతికత వినియోగంలో 75 శాతానికిపైగా సూక్ష్మ,చిన్న మధ్య తరహా పారిశ్రామిక రక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థలు భాగస్వామ్యం అయినట్లు నేవీ వర్గాలు పేర్కొన్నాయి. శత్రువుల రాడార్‌లకు కనిపించకుండా పనిచేసే సామర్థ్యం ఈ వార్‌షిప్ ప్రత్యేకత. ఐఎన్ఎస్ తారాగిరిని గతేడాది నవంబరు 28న నేవీకి అప్పగించారు.

**ఐఎన్ఎస్ తారాగిరి విశేషాలివే..**

149 మీటర్ల పొడవు, 17.8 మీటర్ల వెడల్పుతో 6,670 టన్నుల బరువుండే ఐఎన్ఎస్ తారాగిరి కంబైన్డ్ డీజిల్/గ్యాస్ ఆధారిత ప్లాంటుతో సముద్ర జలాల్లో గంటకు 28 నాట్స్ వేగంతో ప్రయాణించగలదు. ఇందులో నిశ్శబ్ద ఫిరంగుల (స్టెల్త్ ఫ్రిగేట్)తో కూడిన ఆధునిక టెక్నాలజీ ఉంది. బరాక్–8 వంటి విమాన విధ్వంసక, 8 బ్రహ్మోస్ నౌకా విధ్వంసక క్షిపణులు ఇందులో ఉన్నాయి. యాంటీ సబ్‌మెరైన్ వార్ఫేర్ వ్యవస్థతోపాటు, శత్రువుల జాడను, ముప్పును ముందే పసిగట్టే రాడార్ వ్యవస్థ ఉంది.

## మరోమారు నోరు పారేసుకున్న ఖవాజా

తిప్పికొడతామన్నారు. ఇరాన్ యుద్ధాన్ని అవకాశంగా తీసుకొని పొరుగుదేశం ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఇటీవల కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ పాక్‌ను హెచ్చరించారు. ఉరి సెక్టార్ దాడి తర్వాత జరిపిన సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా తర్వాత వైమానిక దాడులు, పహల్గాం దాడుల అనంతరం ఆపరేషన్ సిందూర్‌లను గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఖవాజా ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## మారిన వాతావరణం

అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండవద్దని సూచించారు. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో ఉన్నవారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, పొలాల్లో పనిచేసే రైతులు, పశువుల కాపరులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అత్యవసర పనులు ఉంటే తప్ప బయటకు రావొద్దని, ప్రయాణాలను వాయిదా వేసుకోవడం ఉత్తమమని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు, నదీ పరివాహక ప్రాంతాల వారు స్థానిక అధికారుల సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మరో వైపు తెలంగాణలోనూ రానున్న 3 రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది. శనివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, జనగామ జిల్లాల్లో వర్షం పడే అవకాశముంది. ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, జనగామ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

## అమరావతిని నాశనం చేయాలని చూస్తే శాసనం చేశాం

ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదానికి సహకరించిన ప్రధాని మోదీ, కేంద్రహోంమంత్రి అమిత్‌షా, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. బిల్లుకు మద్దతిచ్చిన అన్ని పార్టీలకు ధన్యవాదాలు చెప్పారు. దేశంలోని అన్ని పార్టీలది ఒక దారైతే వైకాపాది మరో దారి. ఆ పార్టీ నేతలు ప్రజల చేత ఓట్లు వేయించుకుని రాష్ట్రానికి ద్రోహం చేశారు. రాష్ట్రం నాశనమైపోయినా ఫర్వాలేదని వైకాపా ముందుకెళ్లింది. అమరావతిని నాశనం చేయాలని చూస్తే మేం శాసనం చేశాం. విభజన జరిగినప్పుడు రెండు రాష్ట్రాల ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయి. సమైక్యాంధ్రప్రదేశ్‌లో తొమ్మిదేళ్లు సీఎంగా ఉన్నా. తెలుగుజాతి కోసం సైబరాబాద్, హైటెక్‌సిటీ నిర్మించాను. రెండు రాష్ట్రాల ప్రజలకు న్యాయం చేసి విభజన చేయాలని కోరాం. రాజధాని లేకుండా రాష్ట్రాన్ని విభజించారు. విభజన తర్వాత పరిపాలన చేసేందుకు ఎక్కడ కూర్చోవాలో తెలియని పరిస్థితి. ఇరిగేషన్ ఎస్ఈ కార్యాలయమే నా క్యాంపు కార్యాలయం అయింది. బస్సులోనే బస చేసేవాడిని. విజయవాడ–గుంటూరు మధ్య రాజధానికి అనుకూలమని 46 శాతం ప్రజలు చెప్పారు. అభివృద్ధి వికేంద్రీకరణ తెదేపా సిద్ధాంతం. రాజధాని ఉంటేనే ఏపీకి భవిష్యత్ ఉంటుందని సంకల్పించాం. రాష్ట్రానికి మధ్యలో రాజధాని ఏర్పాటు చేశాం. నాకున్న అనుభవంతో తెలంగాణలోని 7 మండలాలను విలీనం చేయించా. పోలవరం ముంపు మండలాలను ఏపీలో కలిపితేనే సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తానని చెప్పా. తెలంగాణకు నేనెప్పుడూ వ్యతిరేకం కాదు. తెలుగు ప్రజల కోసం హైదరాబాద్‌ను అభివృద్ధి చేశాం. తెలంగాణ ప్రజల గౌరవాన్ని పోగొట్టుకునే పని ఎప్పుడూ చేయను" అని సీఎం చంద్రబాబు అన్నారు.

## ఇరిగేషన్ అధికారులు తీరు మార్చుకోవాలి

పూడిక తీత వంటి పనులు చేయడానికి ఏప్రియల్, మే, నెలలో మాత్రమే అవకాశం ఉంటుంది. ఆతరువాత ఖరీఫ్ సీజన్ మొదలైతే పనులు చేయడానికి అవకాశం ఉండదని, గతంలో ఏప్రియల్, మే నెలలో చేయాల్సిన పనులకు జూన్ లో అనుమతులు ఇచ్చేవారని, పనులు మొదలుపెట్టిన వెంటనే కాలువలకు నీళ్ళు వదిలేవారని, దీంతో పనులు సగంలోనే వదిలేయాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ఇలా చేయడం వల్ల ఆయకట్టు చివరన ఉన్న పొలాలకు సాగు నీరందక రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుందని, ఇలా గతంలో వ్యవహరించిన తీరులో కాకుండా ముందుగానే అంచనాలు రూపొందించి, ఆర్థిక శాఖ అనుమతులు పొందితే సీజన్ మొదలయ్యేలోగా పనులు కూడా పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందని అన్నారు. కావున నియోజకవర్గాల వారీగా పనులకు సంబందించిన అంచనాలను ఆదివారం సాయంత్రం లోగా పంపాలని సిఈలను ఆదేశించారు. గడువులోగా అంచనాలను పంపని అధికారులు సోమవారం అమరావతి సచివాలయంకు వచ్చి అంచనాలు ఎందుకు పంపలేకపోయారో సంజాయిషీ ఇచ్చుకోవలసి ఉంటుందని తీవ్రంగా మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అత్యవసర పనుల కింద నిధులు విడుదల చేసి, కాలవల్లో పూడిక తీత, తూడు, గుర్రపుడెక్క తొలగింపు వంటి పనులను చేయడం ద్వారా ఆయకట్టు రైతులకు సాగునీరందించగలిగామని తెలిపారు. గత 5ఏళ్ళ వైసిపి ప్రభుత్వ పాలనలో కనీస నిర్వహణ పనులు సైతం పట్టించుకోకపోవడంతో ఆయకట్టు చివరి ఎకరం వరకు నీరందక రైతులు ఇబ్బంది పడ్డారని, నేడు కూటమి ప్రభుత్వం ప్రతి ఎకరాకు సాగు నీరందించడమే లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నామని స్పష్టం చేశారు. కావున అధికారులు నిర్లక్ష్యం వదిలి గడువులోగా ఇరిగేషన్ పనులకు సంబందించిన అంచనాలు సమర్పించి, సీజన్ మొదలయ్యేలోగా, నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## అమరావతిపై కమ్ముకున్న చీకట్లు తొలగిపోయాయి

**- ఇది ఒక చారిత్రాత్మకమైన రోజుగా గుర్తుండిపోతుంది**

**- ఉభయ సభల్లో చట్టబద్ధతపై ఎమ్మెల్యే పరిటాల సునీత హర్షం**



**అనంతపురం, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అమరావతి చట్టబద్ధత బిల్లుకు పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదం ద్వారా రాజధానిపై కమ్ముకున్న చీకట్లు తొలగిపోయాయని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. పార్లమెంటులోని ఉభయ సభల్లో ఆమోదం తర్వాత ఆమె హైదరాబాద్ లోని తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. అమరావతికి వెలుగులు వచ్చాయన్న సంకేతంగా దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ఇది ఒక చారిత్రాత్మకమైన రోజు అని అన్నారు. ఐదున్నర కోట్ల మంది ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్ష మేరకు ఇక అమరావతి శాశ్వత రాజధానిగా ఉంటుందన్నారు. రైతులు ఎంతో త్యాగంతో 30 వేల ఎకరాల భూమిలిస్తే జగన్మోహన్ రెడ్డి అమరావతిలో విధ్వంసం సృష్టించారన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో జగన్ కు గట్టిగా బుద్ధి చెప్పినా ఆయన తీరు మారలేదన్నారు. మావిగన్ పేరుతో ఇంకో ప్రతిపాదన తీసుకురావడం ఆయన కుట్రలకు నిదర్శనం అన్నారు. రాష్ట్ర ప్రజలు ఇప్పటికే జగన్మోహన్ రెడ్డి తీరు గురించి అర్థం చేసుకున్నారన్నారు. ఇక ఎవరు వచ్చినా అమరావతిని కదిలించలేరని.. ఇది ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాల్సిన రోజని ఎమ్మెల్యే సునీత అన్నారు.

## అమరావతి వేడుకలతో వెలిగిపోయిన శ్రీ సత్యసాయి జిల్లా



**పుట్టపర్తి, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధ గుర్తింపు లభించిన చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా సంబరాలు ఘనంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. అమరావతిలో 'అమర జ్యోతి' వెలిగించిన సమయానికే, జిల్లాలోని ప్రతి ఇంటి ముందు మహిళలు ముగ్గులు వేసి, దీపాలు వెలిగించి జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలన్నింటినీ విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. సోషల్ మీడియా వేదికగా విస్తృత ప్రచారం కల్పిస్తూ, ప్రభుత్వ అధికారులు తమ ఫోన్లలో ఒకే రకమైన డిస్ప్లే పిక్చర్‌ను వినియోగించారు. ఈ చారిత్రాత్మక విజయంలో భాగస్వాములైన ప్రజలందరికీ కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం మౌర్య భరద్వాజ్, డిఆర్ఓ విజయసారధి,సూూ సక్సేన, సివిల్ సప్లై ఆఫీసర్ వంశీ కృష్ణ రెడ్డి,డిఆర్‌డిఎ పిడి నరసయ్య,పుట్టపర్తి తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి,కలెక్టరేట్ సిబ్బందీ పాల్గొన్నారు.

## ప్రజల వద్ద నుండి గ్రీవెన్స్ స్వీకరించిన ఎమ్మెల్యే కాకర్ల



**వింజమూరు, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వింజమూరు లోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయం ప్రజా సమస్యల పరిష్కారానికి గౌరవ ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ నియోజక వర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వయంగా స్వీకరిస్తూ ప్రజల నుంచి వచ్చిన రెవెన్యూ సంబంధిత సమస్యలు, మౌలిక వసతుల లోపాలు, రహదారులు, తాగునీరు, విద్యుత్, పింఛన్లు వంటి అనేక అంశాలపై ఎమ్మెల్యే శ్రద్ధగా స్పందిస్తూ, సంబంధిత శాఖల అధికారులతో వెంటనే మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. సమస్యల తీవ్రతను బట్టి వెంటనే స్పందిస్తూ, అవసరమైతే ప్రత్యక్షంగా పరిశీలన చేసి, త్వరితగతిన పరిష్కారం అందేలా కృషి చేస్తున్నారు.

## గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులు : ఎంపీడీఓ

**నాయుడుపేట, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నాయుడుపేట. ఏప్రిల్ 2వ తేదీన పంచాయతీ సర్పంచుల పదవీకాలం ముగియడంతో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు జిల్లా గ్రామ పంచాయతీరాజ్ అధికారి నాయుడుపేట మండలంలోని 19 పంచాయితీలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు నాయుడుపేట ఎంపీడీఓ కె.సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలియజేశారు.నాయుడుపేట మండలంలోని అన్నమేడు, చిగురుపాడు,గొట్టుప్రోలు గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారిగా ఎంఈఓ 2 బి మునిరత్నం ను నియమించినట్లు తెలిపారు.అలాగే అరవపెరమిడి, పుదూరు,పండ్లూరు,చిలమత్తూరు -డిప్యూటీ ఎంపీడీఓ జి.భువనేశ్వర్ శర్మ,భీమవరం, కాపులూరు-తహసిల్దార్ ఎం రాజేంద్ర,ద్వారకాపురం కల్లిపేడు- వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పి.గోవర్ధన్ రెడ్డి,విన్నమాల జువ్వలపాలెం-ఎస్ జి ఎస్ డబ్ల్యు మండల అధికారి ఎ.శ్రీనివాసులు, తిమ్మాజీ కండ్రిగ,పూడేరు, కూచివాడ-ఎంపీడీఓ కె.సురేష్ బాబు,మర్లపల్లి,వేమగుంట పాలెం-మండల వ్యవసాయాధికారి జె.గణేష్, మేనకూరు-మండల హార్టికల్చర్ అధికారి కె.శారదలను గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు ఎంపీడీఓ కె.సురేష్ బాబు తెలియజేశారు.




## అమరావతి రాజధాని నిర్ణయంపై సంబరాలు

**శ్రీకాళహస్తి రూరల్, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అమరావతిని శాశ్వత రాజధానిగా నిర్ణయించిన సందర్భంగా పట్టణంలో గురువారం తెలుగు దేశం పార్టీ నాయకులు, కూటమి కార్యకర్తలు పండుగ వాతావర ణంలో సంబరాలు నిర్వహించారు. శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు, పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కీర్తిశేషులు నందమూరి తారకరామారావు, భారత దేశ గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం కార్యకర్తలు రంగులు జల్లు కుంటూ, స్వీట్లు పంచుకుంటూ, టపాకాయలు పేల్చుతూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ మాట్లాడుతూ, అమరావతి రైతుల త్యాగాలను ఎప్పటికీ మరువలేమని, వారి త్యాగాల ఫలితంగానే అమరావతి రాజధానిగా చట్టసభల్లో ఆమోదం లభించిందన్నారు. కార్యక్రమంలో పట్టణ క్లస్టర్ ఇన్‌చార్జీలు, భూత్ ఇన్‌చార్జీలు, బీఎల్ఏలు, తెలుగు మహిళా నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జాతీయ జెండాలు, తెలుగుదేశం పార్టీ జెండాలతో "జై అమరావతి- జై జై అమరావతి" నినాదాలు చేస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## శ్రీసిటీలో రూ.70 కోట్ల పెట్టుబడితో రాక్‌వర్త్ పరిశ్రమ విస్తరణ

**- సిఎస్ఆర్ ద్వారా 100 మంది పిల్లలకు విద్యా సాయం**




**శ్రీసిటీ, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆఫీస్ ఫర్నిచర్ తయారీ అగ్రగామి సంస్థ రాక్‌వర్త్ సిస్టమ్స్ ఫర్నిచర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సుమారు రూ.70 కోట్ల పెట్టుబడితో తమ శ్రీసిటీ తయారీ యూనిట్‌ను విస్తరించనుంది. నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభం సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ & సీఈఓ శైలేష్ కుమార్ సింగ్ కుటుంబ సభ్యులతో కలిసి కంపెనీ ఆవరణలో సంప్రదాయ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ విస్తరణ ప్రణాళికను ప్రకటించారు.అలాగే, కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా తన తల్లి జ్ఞాపకార్థం మీనాదేవి మెమోరియల్ ఫౌండేషన్ పేరిట ఆర్థికంగా వెనుకబడిన కంపెనీ కార్మికుల కుటుంబాలకు చెందిన పిల్లలకు విద్యా సహాయం అందిస్తున్నట్లు శైలేష్ కుమార్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. 2026--27 విద్యా సంవత్సరానికి 37 మంది కొత్త లబ్ధిదారులకు సుమారు రూ.67 లక్షల విలువైన విద్యా సహాయం చెక్కులను పంపిణీ చేసిన ఆయన, దీనితో కలిపి ఇప్పటివరకు 100 మంది పిల్లలకు ఈ సాయం అందించామని తెలిపారు.తమ సంస్థ సామాజిక బాధ్యత పట్ల కట్టుబడి ఉందని, విద్యారంగ అభివృద్ధికి నిరంతరం సహకరిస్తూ, మరెంతో మంది విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపడేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.దీనిపై స్పందించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ప్లాంట్ విస్తరణతో శ్రీసిటీ పారిశ్రామిక వృద్ధికి తోడ్పడటమే కాకుండా, సంస్థ చేపట్టిన విద్యా చేయూత కార్యక్రమాలు ఆదర్శనీయమంటూ రాక్‌వర్త్ యాజమాన్యాన్ని అభినందించారు.2011లో శ్రీ సిటీలో స్థాపించబడిన రాక్‌వర్థ్ సంస్థ ఆధునిక తయారీ సాంకేతికతలతో ఆఫీస్ ఫర్నిచర్ ఉత్పత్తిలో ప్రముఖ స్థానం సంపాదించింది. సుమారు 400 మందికి ఉపాధి కల్పిస్తూ, అందులో 90 శాతం స్థానిక ఉపాధికి పెద్దపీట వేసింది.

## ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి

**- ఆన్లైన్ పేరుతో పాఠ్యపుస్తకాలు అమ్మకాలను అడ్డుకట్టు వేయాలి**

**- జిల్లాలో అనుమతులు లేకుండా నడుపుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి**

**- ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి**

**అనంతపురం అర్బన్, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏఐఎస్ఎఫ్ అనంతపురం నగర ముఖ్య నాయకుల సమావేశం స్థానిక నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ నందు ఏర్పాటు చేయడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి పాల్గొన్నారు ఈ సందర్భంగా కుల్లాయి స్వామి మాట్లాడుతూ అనంతపురం జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అడ్మిషన్లకు ఎర్ర లేపుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెబుతూ అడ్మిషన్లు చేపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాల అడ్మిషన్లు జూన్లో ప్రారంభం కావాల్సి ఉంటే కానీ జిల్లాలో ఉన్నటువంటి కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యులు పీఆర్వోలను అక్కడ పని చేస్తున్నటువంటి టీచర్లను ఏర్పాటు చేస్తూ వాళ్లకు టార్గెట్లు ఇస్తూ రోజుకు మీరు ఇల్లు అడ్మిషన్లు చేయాలని హుక్కుం జారీ చేస్తున్నారని మండిపడ్డారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే రేపు సంవత్సరానికి సంబంధించిన పుస్తకాలు ఇప్పుడే కొనుగోలు చేయాలని పుస్తకాలకు సంబంధించి డబ్బులను ఆన్లైన్లో చెల్లిస్తే అవి కొరియర్ ద్వారా మీ ఇంటికి చేరుతాయని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేస్తూ ముందస్తుగానే డబ్బులు చెల్లించుకుని పుస్తకాలు విద్యాసంస్థల పేరుతో ముద్రించిన వాటిని విక్రయిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యాసంవత్సర పేరుతో ముద్రించిన పుస్తకాలు బెల్టు షూ టై రకరకాల స్టేషనరీ వస్తువులను వేల రూపాయలకు అమ్ముతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఒకటవ తరగతి రెండవ తరగతి మూడవ తరగతి లాగా తరగతులు నిర్వహించాలని చెబుతున్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా మార్కెట్లో కూరగాయల రూపాలలో రకరకాల గ్రూపులు ఏర్పాటు చేసుకొని ఒక్కొక్క గ్రూపుకు ఒక్కొక్క ఫీజు అంటూ విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి డబ్బులను జిలగల్లాగా పీల్చుకుంటున్నారని మండిపడ్డారు. జిల్లాలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక సెక్షన్కు అనుమతి తీసుకొని అదే బ్రాంచ్లో మూడు నాలుగు సెక్షన్లు నిర్వహిస్తూ, అనుమతులు తీసుకోకుండా నడుపుతూ అదే విధంగా పాత అనుమతులు అనే రెన్యువల్ చేసుకోకుండా జిల్లా విద్యాశాఖ అధికారులు బోల్తా కొట్టిస్తున్నారని తెలిపారు. జిల్లాలో అనుమతులు లేకుండా నడుపుతున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ముందస్తుగా పాఠశాల అడ్మిషన్లు నిర్వహించిన పుస్తకాల వ్యాపారం చేసిన, అనుమతులు లేని విద్యా సంస్థల పైన రకరకాల గ్రూపులు ఏర్పాటు చేసుకుని నడుపుతున్న విద్యాసంస్థల పైన ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు మంజునాథ్ కార్యదర్శి ఉమా మహేష్ నాయకులు నాని సమీర్ సాయి అరవింద్ సుశ్రీత్ ఆఫన్ సంజు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో గార్మెంట్ పరిశ్రమలను ఏర్పాటు చేయాలి

**- పరిశ్రమల ద్వారా వేలాది మందికి ఉపాధి కల్పించాలి**

**- అవసరమైన భూములు కేటాయిస్తాం : మంత్రి పయ్యావుల కేశవ్**

**అనంతపురం, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అనంతపురం జిల్లాలో గార్మెంట్ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని ఎన్ఐసి భవనం నుంచి గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ కు చెందిన అరవింద్ గ్రూప్ గార్మెంట్స్ ప్రతినిధులతో అనంతపురం జిల్లాలో గార్మెంట్ పరిశ్రమలు ఏర్పాటు చేసి అంశంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో గార్మెంట్ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని అరవింద్ గ్రూప్ గార్మెంట్స్ ప్రతినిధులను ఆహ్వానించారు. గార్మెంట్ పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా వేలాది మందికి ఉపాధి లభించడం జరుగుతుందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములను ప్రభుత్వం నుంచి కేటాయించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకువచ్చేందుకు, పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు అన్ని రకాలుగా కృషి చేయడం జరుగుతోందన్నారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ప్రభుత్వం నుంచి అన్ని విధాల సహాయ సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా పరిశ్రమలు ఏర్పాటుపై అరవింద్ గ్రూప్ ప్రతినిధులతో చర్చించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ ఏ.మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, ఏపీఐఐసి జెడ్ఎం నాగకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా

## గడ్డివాము ట్రాక్టర్లను తొలగించండి



**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణానికి సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న చెర్లోపల్లి గ్రామానికి వెళ్లే దారిలో హైవే నిర్మాణ పనులు జరిగి వాహన రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఏపీ టూరిజం ముందర బ్రిడ్జి నిర్మాణం ఉంది. దాని కింద ఎండు గడ్డివాము ట్రాక్టర్లను నిలిపివేస్తున్నారు. దీనివల్ల తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి వేలాది వాహనాలు వస్తు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ కుడివైపున టర్న్ తీసుకోవాల్సి ఉంది. అయితే ఈ గడ్డివాము ట్రాక్టర్లను ఇక్కడ నిలిపివేయడం వల్ల వాహనదారులకు ముందర వచ్చే వాహనాలు కనిపించకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏదైనా ప్రమాదాలు జరగకముందే చర్యలు తీసుకుంటే బాగుంటుందని వాహనదారులు వాపోతున్నారు. దీనిపై అధికారులు స్పందించాల్సినదిగా ప్రజలు కోరుతున్నారు.

## శాశ్వత రాజధాని అమరావతి



**రామచంద్రపురం,ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్ర విభజన తరువాత రాజధానిపై వున్న అపోహలు అన్నిటికీ స్వస్తి పలుకుతూ పార్లమెంట్, రాజసభలో అమరావతి రాజధానిగా గుర్తిస్తూ విభజన చట్టాన్ని సవరించిన బిల్లు ఆమోదం పొంది రాష్ట్రపతి పంపారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షని నెరవేర్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఆమోదం తెలిపిన 40 రాజకీయ పార్టీలకు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎన్డీఏ నాయకులకు ఐదు కోట్ల ఆంధ్రులు ధన్యవాదాలు తెలుపుతున్నారు. ఇదీ స్ఫూర్తితో 1947కి వికసిత భారత్ వికసిత ఆంధ్రప్రదేశ్ కలను సాకారం చేసుకుందాం అని బీజేపీ తిరుపతి జిల్లా కార్యదర్శి హరినాధరెడ్డి అన్నారు.

## గ్రామ సర్పంచ్‌కి వీడ్కోలు



**రామచంద్రపురం , ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏప్రిల్ రెండవ తేదీతో సర్పంచుల పదవి కాలం పూర్తి అయిన సందర్భంగా రామచం ద్రపురం మండలంలోని సి రామాపురం పంచాయతీ సర్పంచ్ కందప రెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి కి గ్రామస్తులు ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించి పంచాయతీ లో చేసిన అభివృద్ధి పనులను కొనియాడారు.తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం సి రామాపురం లోని గ్రామ సర్పంచ్ కందప రెడ్డి గారి సుబ్రహ్మణ్యం రెడ్డి పదవి కాలం నిన్నటితో పూర్తి అయిన సందర్భంగా మండల ప్రజాప్రతినిధులు,గ్రామస్తులు, పంచాయతీ అధికారులు ఘనంగా వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఎంపిపి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధిలో మండలంలో సి రామాపురం పంచాయతీ ఆదర్శంగా నిలిచిందన్నారు. సర్పంచ్ తనయుడు పవన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా స్మశానం విషయంలో పంచాయతీలో గ్రామస్తులు పడుతున్నా బాధలు తొలగించాలని మొదటి అభివృద్ధి స్మశాన సమస్య పరిష్కారం చేసా అన్నారు, అలాగే ఆలయాలు అభివృద్ధి, త్రాగునీరు సమస్య, సి సి రోడ్డు అభివృద్ధి ఇలా అనేక రకాల అభివృద్ధి పనులు గ్రామస్తులు సహకారంతో చేసాం అన్నారు.సి. రామాపురం పంచాయతీ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందించిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి , మండల నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సర్పంచ్ సుబ్రహ్మణ్యం రెడ్డి ని, వార్డ్ మెంబర్లు కు, మాజీ గ్రామ వాలంటీర్లు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రాజధానిగా అమరావతి ఏర్పాటు



**పిచ్చాటూరు, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్ర ప్రదేశ్ రాజధానిగా అమరావతి ఏర్పాటు చేయడం రాష్ట్రానికి శుభ సూచికమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్పష్టం చేశారు.శుక్రవారం పిచ్చాటూరు లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ అమరావతిని రాజధానిగా తీర్మానం చేయుటకు గాను మార్చి 28న ఏపీ శాసన సభలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసిన సంగతిని గుర్తు చేశారు. వెంటనే ఈ తీర్మానాన్ని కేంద్రానికి పంపి ఎప్రిల్ ఒకటిన లోక్ సభలో రెండవ తేదీన రాజ్యసభలో. మూజువాణి ఓటు తో ఆమోదం పొందేలా చేసిన గౌరవ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారికి, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కల్యాణ్ గారికి, మంత్రి శ్రీ నారా లోకేష్ గారికి, ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ అమరావతి బిల్లుకు ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ సహా అన్నీ పార్టీలు మద్దతు తెలపడం శుభ పరిణామం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్రపతి ఆమోదం కోసం బిల్లును రాష్ట్రపతి భవన్ కి పంపారని, ఒకటి రెండు రోజుల్లో రాష్ట్రపతి ఆమోదం పొంది ఏపీ రాజధాని అమరావతి అనే అధికారిక ప్రకటన వెలువడనుందని ఆయన వివరించారు.ప్రజా రాజధాని అమరావతి ఏర్పాటు పై రాష్ట్రంతో అన్నీ వర్గాల ప్రజలు సంభరాలు చేసుకుంటున్నారని, త్వరలో ప్రభుత్వం కూడా అధికారికంగా సంభరాలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఇకపై ప్రోటోకాల్ ఉల్లంఘనను సహించేది లేదని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్పష్టం చేశారు.నియోజకవర్గంలోని ప్రతి అధికారి భారత రాజ్యాంగ బద్ధంగా ప్రోటోకాల్ ను విధిగా పాటించాలని ఎమ్మెల్యే ఆదిమూలం సూచించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## 'బోరు'మంటున్నా పట్టించుకోరా..! సీపీఎం



**శ్రీకాళహస్తి రూరల్, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజల దాహార్తిని తీర్చేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన చేతి బోర్లను పట్టించుకునే వారు లేక బోరుమంటున్నాయని సిపిఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి విమర్శించారు. శుక్రవారం సిపిఎం నాయ కులు శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని పెంకులపాడు గ్రామంలో పర్యటించారు. వేసవి ఎద్దడిని తట్టుకునేలా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టలేదని మణి మండిపడ్డారు. గ్రామం నడిబొడ్డున ఉన్న ఓ చేతి పంపు శిధిలావస్థకు చేరి పిల్లల పాలిట ప్రమాదకరంగా మారినా అధికారులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో తాగి నీటి పైపులైన్లు, కొళాయిలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. అధికారులు సత్వరమే స్పందించి చేతి పంపును వినియోగంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పిల్లల్లో ప్రతిభను వెలికి తీయడానికే థిల్లానా ఎక్స్‌పో

### - విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



**మదనపల్లె, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మదనపల్లె నందు థిల్లానా సాంస్కృతిక సంస్థ టాలెంట్ ఎక్స్పో పేరుతో డాన్స్, పెయింటింగ్, సింగింగ్ విభాగాలలో జిల్లాస్థాయి సాంస్కృతిక పోటీలను నిర్వహించింది. దీనికి పిల్లల నుండి మంచి స్పందన లభించింది. శుక్రవారం స్థానిక సొసైటీ కాలనీలో శ్రీ గుడ్ విల్ కంప్యూటర్స్ నందు మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ట్రాఫిక్ సిఐ గురునాథ్, కలికిరి సిఐ అనిల్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ ప్రముఖ వ్యాఖ్యాత రామ్మూర్తి, థిల్లానా కల్చరల్ సొసైటీ ఫౌండర్ వెంకటేష్, ఉపాధ్యాయుడు బి.వి రమణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్తమాన కాలంలో పిల్లలు సెల్ ఫోన్లకు అలవాటు పడి వారిలో వున్న ప్రతిభను మరచి తున్నారని గుర్తు చేశారు. వాటి నుండి వారిని దూరం చేయాలనే సదు ద్దేశ్యంతో నిర్వహించిన థిల్లానా టాలెంట్ ఎక్స్పోలో పాల్గొని ప్రతిభను చాటి చెప్పిన పిల్లలను అభి నందించారు. చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. చిన్నతనం నుండే దేశభక్తి సామాజిక స్పృహను, పెంపొందించుకొని దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. థిల్లానా కార్య నిర్వాహకులు నాగరాజ్, సురేష్, దిలీప్, జస్వంత్‌లు మాట్లాడుతూ థిల్లానా టాలెంట్ ఎక్స్ పోలో మదన పల్లె, గాలివీడు, నూలివీడు, పుంగనూరునుండి విద్యార్థులు పాల్గొన్నారు. పిల్లలలో వున్న ప్రతిభను వెలికి తీసి అవకాశాలు కల్పించడంలో థిల్లానా ఎప్పుడు ముందుంటుందని పేర్కొన్నారు. అనంతరం విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, శ్రీ గుడ్విల్ కంప్యూటర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్టీ కాలనీలో రెడ్డి సంక్షేమ సంఘం బట్టల పంపిణీ



**వై.వి. పాలెం, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వై.వి.పాలెం మండలం నెరబైలు ఎస్టీ కాలనీలో యానాదులకు బట్టలు సహకారం అందించడం పూర్వజన్మ సుకృతం అని గండబోయనపల్లి శ్రీ సత్యమ్మ తల్లి ఆలయ కమిటీ చైర్మన్, రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు పులి సత్యనారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో ఎర్రవారిపాలెం మండలం నెరబైలు గిరిజన కాలనీలో బట్టలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పులి సత్యనారాయణ రెడ్డికి, అమర్నాథరెడ్డికి, రామిరెడ్డికి, తాతిరెడ్డికి, ఏ.పి.జి.వై.ఎస్.ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులను గిరిజనులు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా పులి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, గిరిజనులకు తమవంతు సేవా కార్యక్రమాలు చేయడం సహకారం అందించడం పూర్వజన్మ సుకృతం అని అన్నారు. కార్యక్రమంలో ఏ.పి.జి.వై.ఎస్.ఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జానం గంగిరెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు సభ్యులు అమర్నాథ్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, తాతిరెడ్డి గిరిజన యానాది నాయకులు ఆదినారాయణ, తిరుమలశెట్టి రమణ, గిరిజన నాయకుడు పాపయ్య తదితరులు హాజరయ్యారు.

## కృపా కాలనీలో ఘనంగా గుడ్ ఫ్రైడే




**కడప, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరంలోని 48వ డివిజన్, కృపా కాలనీ నందు న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మల ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ పి.మహేష్ దైవ సందేశాన్ని ఇస్తూ, లోకంలోని పాపులను నీతిమంతులుగా మార్చడానికి యేసుక్రీస్తు కల్వరి సిలువపై తన అమూల్యమైన రక్తాన్ని చిందించా రని కొనియాడారు. మరణాన్ని జయించిన విజేత క్రీస్తు అని, ఆయన సిలువపై పలికిన ఏడు మాటల లోని అంతరార్థాన్ని భక్తులకు వివరించారు. ప్రతి ఒక్కరూ క్రీస్తు మార్గంలో నడుస్తూ, ఆయన ప్రసాదించే శాంతిని, రక్షణను పొందుకోవాలని పిలుపునిచ్చారు.

## ఏఐటియుసి 18వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేద్దాం

### - ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

**ములకలచెరువు, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతిలోఈనెల 26 నుండి 29 వరకు జరుగునున్న ఏఐటీయూసీ రాష్ట్ర 18వ మహాసభలను విజయవంతం చేద్దామని, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ,ఉప ప్రధాన కార్యదర్శి సలీం భాషాలు తెలిపారు. శుక్రవారం ములకలచెరువు ఆర్టీసీ బస్టాండ్ లో ఏఐటీయూసీ మహసభల కరపత్రాలు విడుదల చేశారు.ఈ సందర్భంగా సాంబశివ , సలీం భాషాలు మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి ముందు, తర్వాత దేశంలో కార్మిక హక్కుల కోసం అశేష త్యాగాలు , ఉద్యమాలు చేసి ఏఐటియుసి ఎన్నో విజయాలు సాధించిందని తెలిపారు.ఎన్నో సంవత్సరాలుగా కార్మిక వర్గం పోరాటాలు చేసి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో 4 నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి కార్మిక హక్కులను హరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ ను పర్మినెంట్ చేసి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, రాష్ట్రంలో 8 పనిగంటల పనిదినాలు అమలు చేయాలని కోరారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లకు పెండింగ్లో ఉన్న నాలుగు నెలల వేతనాలు చెల్లించాలని కోరారు.భవణ నిర్మాణ కార్మికులకు పెండింగ్లో ఉన్న 46 వేల క్లైములు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ తంబళ్లపల్లి నియోజకవర్గ కార్యదర్శి వేణు గోపాల్ రెడ్డి, సీపీఐ మొలకలచెరువు మండల కార్యదర్శి అంజనప్ప, వెంకటరమణ, మల్లికార్జున,నసీమ,పీరమ్మ రామలక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



**ములకలచెరువు, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ములకలచెరువు మండలంలోని చర్చలలో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రార్థనలు నిర్వహించారు. విశ్వవాణి ప్రార్థన మందిరంలో స్టేట్ ఆంధ్రా కోఆర్డినేటర్ రేవన్ నాగేంద్రుడు నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య ప్రసంగికులుగా డాక్టర్ అగస్టిన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ విశ్వాసులను ఉద్దేశించి మాట్లాడుతూ ఏసుప్రభువు సిలువలో పలికిన ఏడు మాటలు, క్రైస్తవ జీవితానికి పరలోక జీవితానికి సంబంధించిన ఏడు కిటికీల లాంటివి, ప్రపంచ మానవాళి పాప విమోచన కొరకు, కలువరి సిలువలో ప్రాణాన్ని, రక్తాన్ని త్యాగం చేస్తూ చావు అంచులలో ఉండి కూడా ప్రాముఖ్యమైన మాటలను ప్రపంచానికి వినిపించారన్నారు. వాటిలో క్షమాగుణం, అభయం, బాధ్యత, ఆవేదన, ఆత్మీయ దాహం, సమాప్తం, ఆత్మానంద్ దేవునికి సమర్పించడం జరిగిందన్నారు. మనం కూడా కలిగి జీవించు ఇతరుల సంక్షేమాన్ని కోరి జీవించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మొలకలచెరువు విశ్వవాణి అసలు సంఘ పెద్దలు పాస్టర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ప్రసన్న భ్రమరాంబిక మల్లికార్జున స్వామి విగ్రహాల ప్రతిష్ఠ

**ములకలచెరువు, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గం మొలకలచెరువు మండలం పాతములకలచెరువులో రూ. 1.56 కోట్ల ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఆలయంలో శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ట. ఈనెల 4 వ తేదీ శనివారము ఉదయం ఎనిమిది గంటల నుండి గణపతి పూజ, భగవత్ పుణ్యాహం, ఆచార్ మాది మృతిక్ వర్ణం, యాగశాల ప్రవేశం, కలషాధారణ, మందనాగి, అగ్ని ప్రతిష్ట, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం, అనంతరం సాయంత్రం ఐదు గంటల నుండి ముత్యం గ్రహణం, సాయం దీక్ష హోమం, మాల మంత్ర జపాలు, వేద పారాయణం, జంబ జలాధివాసం, స్వస్తి పఠనం, మహా మంగళహారతి. 5వ తేదీ ఆదివారం ఉదయం ప్రాంతకాల పూజ, మాల మంత్ర జపాలు, ప్రాంతా దీక్ష హోమం, ప్రతిష్ట హోమం, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం, అనంతరం సాయంత్రం మంత్ర ప్రతిష్ట, ధ్వజ ప్రతిష్ట, సాయం దీక్ష హోమం, ప్రతిష్ట హోమాలు, వేద పారాయణం, నవగ్రహ హోమం, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాదాలు. 6వ తేదీ సోమవారం ఉదయం ప్రాణ ప్రతిష్ట, దింభ కలాన్యం, దైవ దర్శనం, కలల ఉద్వాసన, మహా కుంభాభిషేకం, బింబ దర్శనం, మహా మంగళహారతి, తీర్థ ప్రసాదాల వినియోగం జరుగును. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి, రవాణా శాఖామంత్రి మండ్లిపల్లి రాంప్రసాద్ రెడ్డి, తంబాలపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి, రాజంపేట పార్లమెంట్ సభ్యులు మిథున్ రెడ్డి, తంబళ్లపల్లి నియోజకవర్గ పాల్గొంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

## జీసస్ మహా త్యాగానికి ప్రతీక గుడ్ ఫ్రైడే



**కడప, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రక్షణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పల్లెకొండు సంపత్ చైతల్యలు శుభ శుక్రవారం సందర్భంగా పానకం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైస్సార్సీపీ సిఈసి మెంబెర్ కే.సురేష్ బాబు మాజీ డిప్యూటీ సీఎం యస్‌బి అంజాద్ బాషా హాజరయ్యారు. విశ్వశాంతి కోసం, ప్రేమతో నిండిన సమాజ స్థాపన కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నతడు ఏసు క్రీస్తు అని కొనియాడారు. ఆయన చరితను, బోధనలను గుడ్‌బిఫ్రైడే సందర్భంగా స్మరించుకుంటూ పానకం పంపిణీ చేయడం అభినం దనీయమన్నారు. ప్రతి ఒక్కరూ సోదర భావంతో ప్రేమ కలిగి ఉండాలని క్రైస్తవ సోదర సోదరీమణులకు ముందస్తుగా ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేసారు. కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు, మాజీ కార్పొరేటర్‌లు ఐస్క్రీమ్ రవి, జాహిర్, కే.బాబు,షఫీ, కిరణ్, దాసరి శివ, సిందే రవిచంద్ర, యస్‌ఈసి మెంబెర్ యానాదయ్య, రమేష్ రెడ్డి, బంగారు నాగయ్య, షఫీఉల్లా, ప్రసన్న, బాబు, శ్యామ్, రవి, అజయ్ పాల్గొన్నారు.

## అమరావతికి చట్టబద్ధత.. ప్రశంసనీయం




**పీలేరు,ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అమరావతిపై ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న అనిశ్చితి పరిస్థితికి ముగింపు పలుకుతూ, కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. నిన్న లోక్‌సభ, రాజ్యసభల్లో అమరావతిని రాష్ట్ర రాజధానిగా చట్టబద్ధంగా గుర్తిస్తూ అన్ని రాజకీయ పార్టీల సమ్మతితో ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించడం చారిత్రాత్మక ఘట్టమని జాతీయ బీసీల కార్యదర్శి డాక్టర్ బత్తుల సంజీవరాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమరావతికి పట్టిన అనిశ్చితి అనే గ్రహణం పూర్తిగా వీడిపోయిందని, ఇది ఐదున్నర కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల దీర్ఘకాలిక ఆకాంక్షలకు న్యాయం చేసిన నిర్ణయమని తెలిపారు. ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## యేసుక్రీస్తు ఆత్మార్పణే గుడ్ ఫ్రైడే

### - సిఎస్ఐ జెసిఎం చర్చ్‌లో ప్రత్యేక ప్రార్థనలు



**మదనపల్లె, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** లోక రక్షకుడు యేసుక్రీస్తు మానవాళి పాపాల కోసం తన ప్రాణాలను ఆత్మార్పణ చేసుకుని, శిలువ మరణం పొందాడని, ఆ రోజునే గుడ్ ఫ్రైడే గా సమస్త మానవాళి జరుపుకుంటున్నారని మదనపల్లె సిఎస్ఐ జెసిఎం చర్చ్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ సి. ఆనంద్ రావు తెలిపారు. గుడ్ ఫ్రైడే ను పురస్కరించుకుని సిఎస్ఐ జేసిఎం చర్చలో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా యేసుక్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటలను ప్రత్యేకంగా ధ్యానించారు. బైబిల్ పఠనానంతరం పాస్టర్ ప్రసంగిస్తూ ప్రతి విశ్వాసి గుండెలో కరుణ, త్యాగం, క్షమాగుణం కలిగి ఉండాలన్నారు. ప్రపంచం చీకటిగా మారిన వేళ యేసు శిలువ మరణాన్ని గుర్తు చేసుకుంటూ, భక్తితో చేసే ప్రార్థనలు ఆధ్యాత్మిక ప్రయాణంలో ఒక మైలురాయిలా నిలిచిపోతాయన్నారు. సమస్త మానవాళి పాప జీవితాలను మార్చేందుకు యేసు శిలువ పై ఏడు మాటలు పలికి తన ప్రాణాలను అర్పించాడన్నారు. ఈ సందర్భంగా సంజయ్ డేవిడ్ కొయర్ బృందం ఆలపించిన భక్తి గీతాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఎక్కువ శాతం భక్తులు ఉపవాసాలతో ప్రార్థనలకు రావడంతో వారికి మజ్జిగ, పళ్ల రసాలు, ఫ్రూట్ సకాడ్ లను పంపిణీ చేశారు. మదనపల్లె పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని చర్చ్ లు, ప్రార్థనా మందిరాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు నిర్వహించారు.

## జాతీయ స్థాయి క్రీడల నిర్వహణ ద్వారా గూడూరుకు గుర్తింపు

### - ఎమ్మెల్యే సునీల్ కుమార్






**చిల్లకూరు, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గూడూరు నియోజకవర్గం లోని చిల్లకూరు మండలంలో బూదనం సమీపంలో ఏర్పాటై ఉన్న ఎ-5 హోటల్‌లో జాతీయ స్థాయిలో టెన్నిస్ పోటీలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు సింగిల్స్, డబుల్స్ పోటీల్లో తలపడ్డారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ హాజరై విన్నర్స్, రన్నర్స్ జట్లకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా గూడూరుకు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ పోటీలు ఎ-5 హోటల్‌లో నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. క్రీడాకారులు ప్రతిభ కనపరిచి అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని రాణిచాలని ఆకాంక్షించారు. జాతీయ స్థాయిలో బద్రి గిరి పోటీలు నిర్వహించడం సంతోషదాయకమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో హోటల్ అధినేత బద్రి గిరి, సి.ఏ రామచంద్ర రావు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



# అన్నమయ్య జిల్లా

## 'మిట్స్' ఫిజికల్ డైరెక్టర్ అంతర్జాతీయ స్థాయి ప్రతిభ



**మదనపల్లె/ కురబలకోట, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీకి చెందిన ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్. సి.దామోదరన్ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచారని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్.సి. యువరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నై ఎస్.ఆర్.ఎమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో 3వ అంతర్జాతీయ సదస్సు నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులో అడ్వాన్స్డ్ స్పోర్ట్స్ సైన్స్ అండ్ ఇంటెలిజెన్స్ పెర్ఫార్మెన్స్ టెక్నాలజీస్ (స్పోర్టయింటల్ 2026) కార్యక్రమంలో డాక్టర్ సి.దామోదరన్ శారీరక విద్య, క్రీడా విజ్ఞాన శాస్త్రాల పాత్ర – ఆరోగ్యం, ఫిట్‌నెస్, జీవితాంతం చురుకైన జీవన విధానం అంశంపై తన పరిశోధన పత్రాన్ని సమర్పించగా ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో మూడవ స్థానంలో కాంస్య పతకం లభించిందని తెలిపారు. ఈ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా అకాడమిషియన్లు, పరిశోధకులు, క్రీడా నిపుణులు పాల్గొని క్రీడా విజ్ఞానం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతలపై తమ పరిశోధన పత్రాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎస్.ఆర్.ఎమ్ యూనివర్సిటీ అడిషనల్ రిజిస్ట్రార్ డాక్టర్ టి.మైథిలి కాంస్య పతకం, ధృవపత్రాన్ని అందజేశారు. అంతర్జాతీయ సదస్సులో ప్రతిభ చూపిన డాక్టర్ సి.దామోదరంను మిట్స్ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ప్రో ఛాన్సలర్ యెన్ ద్వారకానాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్,అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

## శుక్రవారం ప్రార్థనలు ఇస్లాంలో అత్యంత పవిత్రమైనవి

### - వైకాపా సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్



**మదనపల్లె,ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రార్థనలు(జుమా) ఇస్లాంలో అత్యంత పవిత్రమైనవని, పురుషులకు మసీదులో సామూహిక ప్రార్థన (నమాజ్) తప్పనిసరి అని,మధ్యాహ్న సమయంలో ఖుత్బా (ఉపన్యాసం) తర్వాత ఈ నమాజ్ నిర్వహిస్తారని మదనపల్లె వైయస్సార్ సిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ పేర్కొన్నారు.మదనపల్లె మండలం బోడుమల్లదిన్నె మస్జిద్-ఎ-అక్బరిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలలో మదనపల్లె వైయస్సార్సిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ శుక్రవారం ప్రార్థనలు ఇస్లాంలో అత్యంత పవిత్రమైనవని,ఇది అల్లాహ్‌తో సాన్నిహిత్యం, ఐక్యతను పెంపొందిస్తుందని తెలిపారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రిష్టియన్ సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. భారతదేశ సర్వమత సమ్మేళనం అని, ఇదే మన లౌకికవాదానికి నిదర్శనమన్నారు. అన్ని మతాలవారు సోదరుభావంతో మెలిగి మతసామరస్యాన్ని పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో జాను, మహమ్మద్ నవాజ్, సయ్యద్ సాబ్, హుస్సేన్ సాబ్, షరీఫ్ సాబ్, హసన్ సాబ్,హైదర్ వలి, యూనస్, ఎన్.నవాజ్, షానవాజ్, ఫక్రుద్దీన్, సత్తార్, జైనుద్దీన్, ఇర్ఫాన్, ఖిజార్ ఖాన్, యాసిన్, అబ్దుల్లా, జబీవుల్లా, బషీర్, సమద్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత మహిళపై దాడి అమానుషం




**కడప, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రైల్వే కోడూర్ ఎమ్మెల్యే బాధితురాలు హర్ష వీణపై కులం పేరుతో దూషించి మారణాయుధాలతో దాడి చేసిన జనసేన పార్టీ రౌడీ మూక తాతంశెట్టి నాగేంద్రపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి వెంటనే అరెస్టు చేయాలని వైయస్సార్సీపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిషోర్ బూసపాటి డిమాండ్ చేశారు . శుక్రవారం కడప లోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరి అండ, ఆదరణ సహాయం లేక ఒంటరిగా న్యాయ పోరాటం చేస్తున్న హర్షవీణపై కోడూరు పట్టణంలో నడిరో డ్డుపై అమాంతంగా కులం పేరుతో దూషిస్తూ రాడ్లతో విచక్షణారహితంగా కొట్టారని చెప్పారు. కార్యక్రమంలో వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు సింగమాల వెంకటేశ్వర్లు, వైఎస్ఆర్ జిల్లా డాక్టర్స్ విభాగం సభ్యులు డాక్టర్ పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యా సామాగ్రి వితరణ

### - మోగిత్ రెడ్డి, మేధాన్ రెడ్డిల పుట్టినరోజు వేడుకలు



**మదనపల్లె, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తంబళ్లపల్లె మల్లయ్య కొండ శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మరియు రెడ్డి సంఘం అధ్యక్షులు కనుగొండ మద్ది రెడ్డి మనువళ్ళు మోగిత్ రెడ్డి, మేధాన్ రెడ్డిల పుట్టినరోజును పురస్కరించుకొని ఉచిత విద్యను అందిస్తున్న స్మైల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్ళు ను అందజేశారు. శుక్రవారం స్థానిక బెంగుళూరు రోడ్డు నందు గల స్మైల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు మోగిత్ రెడ్డి, మేధాన్ రెడ్డిల పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కనుగొండ మద్దిరెడ్డి, మాజీ సర్పంచ్ పసుపు లేటి చలపతిలు ముఖ్య అతిథులుగా హాజరు కాగా పాఠశాల విద్యార్థులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పిల్లలు సమక్షంలో కేక్ కట్ చేసి అందరికి పంచి పెట్టడం జరిగింది. కార్యక్రమంలో చిప్పిలి, కురవంక యూత్, బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షులు పునీత్ కుమార్, గోపినాథ్, రమేష్, నాగరాజు, సాయి, హనుమంతు, రాజు, హరి, శ్రీధర్, ఇమ్మన్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వివాహిత బలవన్మరణం



**గూడూరు, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో ఓ యువతి బలవన్మరణానికి పాల్పడి మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. మృతురాలు దేశాయి శెట్టి వీణ జెస్సి(23). వెంకటగిరి నివాసి దేశాయి శెట్టి నిర్మల కుమార్తె వీణ జెస్సి 2021లో పంచేటి రవీంద్ర కుమారుడు వంశీని వివాహం చేసుకుని ఇద్దరు పిల్లలు జయంత్(4), నితిన్ (2) కలిగి ఉన్నారు. ఫిర్యాదు మేరకు భర్త వంశీ తన భార్యపై అనుమానం పెంచుకుని తరచూ మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేసేవాడని ఆరోపణలు ఉన్నాయి. ఈ వేధింపుల కారణంగా దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. గురువారం సాయంత్రం మళ్లీ గొడవ జరిగిన అనంతరం వేధింపులను తట్టుకోలేక వీణ జెస్సి ఉరివేసుకుని మృతి చెందినట్లు సమాచారం. మృతురాలి తల్లి దేశాయిశెట్టి నిర్మల ఫిర్యాదు మేరకు భర్త వంశీపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. భార్యపై అనుమానం పెంచుకుని భర్త తరచూ వేధింపులకు గురిచేయడం వల్ల మానసిక ఒత్తిడితో ఈ ఘటన జరిగినట్లు ప్రాథమికంగా భావిస్తు ఈ ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## మరో మూడు రోజులు పార్లమెంట్

**-16 నుంచి తిరిగి సమావేశాలు ప్రారంభం**

**-మహిళా రిజర్వేషన్, ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లులపై చర్చ**

**న్యూఢిల్లీ,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ):** మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లు, ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లు వంటి ముఖ్యమైన బిల్లులను ఆమోదింపజేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలను పొడిగించేందుకు ప్రయత్నిస్తోంది. గురువారం బడ్జెట్ సమావేశాల రెండో దశ ముగిసిన తరువాత పార్లమెంట్ నిరవధికంగా వాయిదా పడుతుందని భావించారు. అయితే, సభా కార్యకలాపాలు ముగిసిన తరువాత, ఈ నెల 16న ఉదయం 11 గంటల వరకు సభ వాయిదా పడుతుందని అధికారిక ప్రకటన వెలువడింది. లోక్‌సభ, శాసనసభలలో సీట్లను పెంచేందుకు, మహిళా రిజర్వేషన్లను అమలు చేసేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదించేందుకే సమావేశాలను పొడిగిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. అదే సమయంలో విమర్శలు ఎదుర్కొంటున్న ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లును కూడా ఆమోదింపజేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లుపై పార్లమెంట్ లోపల, వెలుపల భారీ నిరసనలు వెల్లువెత్తిన సంగతి విదితమే. కేరళం శాసనసభ ఎన్నికల ముందు ఈ బిల్లు ఆమోదం పొందితే బిజెపికి పెద్ద ఎదురుదెబ్బ తగులుతుందని కూడా కేంద్ర ప్రభుత్వం గ్రహించింది. కేరళలో ఎన్నికల తరువాతే పార్లమెంట్ తిరిగి సమావేశమవుతుంది. ఈ పరిస్థితుల్లో, ప్రత్యేక సమావేశంలో ఎఫ్‌సిఆర్ఎ బిల్లును కూడా ఆమోదిస్తారన్న ఆందోళన వ్యక్తమవుతోంది. మహిళా రిజర్వేషన్లను అమలు చేయడానికి ఉద్దేశించిన రాజ్యాంగ సవరణలను ఎలా అమలు చేయాలన్న ప్రతిపక్షాల ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం ఇంకా సమాధానం ఇవ్వలేదు. రాజ్యాంగ సవరణను ఆమోదించడానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపక్షాల మద్దతు కూడా అవసరం. అయితే, అఖిలపక్ష సమావేశం నిర్వహించడానికి గానీ, ప్రతిపక్షాల సందేహాలకు వివరణ ఇవ్వడానికి గానీ కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం తన సొంత ప్రయోజనాలకు అనుగుణంగా రిజర్వేషన్లను అమలు చేయడానికి ప్రయత్నిస్తోందన్న అనుమానం వ్యక్తమవుతోంది. లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య పెంపు, మహిళా రిజర్వేషన్ చట్టం సత్వర అమలు వంటి కీలక బిల్లుల కోసం మూడురోజుల పాటు సమావేశాలు కొనసాగే అవకాశాలున్నాయని, ఈ విషయాన్ని విపక్షాలకు ప్రభుత్వం తెలిపిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మహిళా రిజర్వేషన్ కోటా అమలు బిల్లుపై, జనగణనతో నియోజకవర్గాల పునర్విభజనకు ఉన్న లంకెను విడదీయడంపై విపక్షాలతో ప్రభుత్వం లోపాయికారీ సంప్రదింపులు జరుపుతోందని తెలుస్తోంది. కేంద్ర సాయుధ పోలీసు దళాల (సీఏపీఎఫ్)కు ఒకే విధమైన ఉద్యోగ నిబంధనలు ఉండేందుకు ప్రతిపాదించిన బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. రాజ్యసభ ఆమోదించి పంపిన ఈ బిల్లును లోక్‌సభ కూడా మూజువాణి ఓటుతో ఆమోదించింది.

## బిజెపితో చేతులు కలిపిన రాఘవ్ చద్దా!

**-పంజాబ్ సిఎం భగవంత్ మాన్ విమర్శలు**

**చండీఘడ్,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ):** రాజ్యసభ ఎంపీ, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేత రాఘవ్ చద్దాపై ఆ పార్టీ విమర్శల బాణం ఎక్కుపెట్టింది. చద్దాకు వ్యతిరేకంగా ఆప్ నేతలు వరుసగా స్పందిస్తున్నారు. ఆయన బీజేపీతో చేతులు కలిపారని ఆరోపిస్తున్నారు. రాజ్యసభలో ఆప్ డిప్యూటీ లీడర్‌గా ఉన్న రాఘవ్ చద్దాను ఆ బాధ్యతల నుంచి ఆప్ తొలగించింది. ఈ నేపథ్యంలో రాఘవ్ చద్దాకు, ఆమ్ ఆద్మీ పార్టీకి మధ్య మాటలయుద్ధం ప్రారంభమైంది. ఒకరిపై ఒకరు పరస్పర విమర్శలు చేసుకుంటున్నారు. తనను పదవి నుంచి తొలగించారేమో కానీ, ఓడించలేరని రాఘవ్ చద్దా అన్నారు. అయితే, ఆయనపై ఆప్ ఎదురుదాడికి దిగింది. పంజాబ్ సీఎం భగవంత్ మన్ కూడా చద్దాపై విమర్శలు గుప్పించారు. బీజేపీతో రాఘవ్ చద్దా చేతులు కలిపారని, ఇది ఆమ్ ఆద్మీ పార్టీలో ఆందోళన కలిగించిందని భగవంత్ మన్ అన్నారు. రాజ్యసభలో లేవనెత్తాల్సిన అంశాలపై ఆప్ సూచించే విషయాల్ని చద్దా పాటించలేదన్నారు. రాజ్యసభలో ప్రజా సమస్యలపై ప్రశ్నించమంటే, చద్దా మాత్రం సమోసాలపై ప్రశ్నించారని ఎద్దేవా చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో తప్పకుండా ఏ పార్టీ అయినా చర్య తీసుకుంటుందన్నారు. మరో సీనియర్ ఆప్ లీడర్ సౌరభ్ భరద్వాజ్ కూడా రాఘవ్ చద్దాపై మండిపడ్డారు. చద్దాకు వీలైతే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్పందించాలని కోరారు. పంజాబ్, దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై చద్దా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాఘవ్ కొన్నేళ్లుగా భయపడుతున్నారని, మోదీకి వ్యతిరేకంగా మాట్లాడలేకపోతున్నారని విమర్శించారు. సభలో మాట్లాడేందుకు దొరికే కొద్దిపాటి సమయంలో దేశం గురించి మాట్లాడాలని సూచించారు. చద్దా తీరుతో ఆప్ కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారని వ్యాఖ్యానించారు.

## మంచిర్యాలలో ఫేక్ నోట్ల కలకలం

**-దొంగనోట్లు చలామణి చేస్తున్న ముఠా అరెస్ట్**

**మంచిర్యాల,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ):** జిల్లాలో దొంగ నోట్ల వ్యవహారం కలకలం రేపింది. ఫేక్ కరెన్సీని నిర్మూలించాలని ఎన్ని చర్యలు తీసుకుంటున్నా వాటి చలామణి మాత్రం ఆగడం లేదు. కొత్తకొత్త ప్లాన్లు వేస్తూ పోలీసులనే బురిడీ కొట్టించే ప్రయత్నం చేస్తున్నారు కేటుగాళ్లు. తాజాగా దొంగనోట్లు చలామణీ చేస్తూ అడ్డంగా బుక్కయ్యారు ఓ ముఠా సభ్యులు. వారి గుట్టురట్టు చేసి కటకటాల వెనక్కి పంపారు పోలీసులు. నిందితుల నుంచి లక్షల రూపాయల ఫేక్ నోట్లు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. మంచిర్యాల జిల్లాలో ఫేక్ నోట్లు చెలామణి చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఫిబ్రవరి 25న ఓ పెట్రోల్ బంకులో మూడు రూ.500 నోట్లు ఇచ్చారు ముఠా సభ్యులు. నోట్లపై ఒకే సీరియల్ నంబర్ ఉండటంతో అనుమానం వచ్చి పోలీసులకు బంక్ సిబ్బంది ఫిర్యాదు చేశారు. తీగ పట్టుకుని లాగగా డొంక మొత్తం కదిలింది. ప్రధాన సూత్రధారి కానుగంటి క్రాంతి సహా 13 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5,98,500లు స్వాధీనం చేసుకున్నారు. 12 సెల్ ఫోన్లు, మూడు వాహనాలు సీజ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడలో తెలిసిన పరిచయాల ద్వారా ఫేక్ నోట్లను కేటుగాళ్లు చలామణి చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈజీ మనీ కోసమే ఫేక్ కరెన్సీని చలామణి చేస్తున్నట్లు విచారణలో తేలింది. వారందరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం

**-పార్టీ నాకు అప్పగించిన బాధ్యత ఇదే -తమిళనాడు బిజెపి నేత అన్నామలై**

**చెన్నై,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ):** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాలో తన పేరు లేకపోవడంపై బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు అన్నామలై స్పందించారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థుల తరపున ప్రచారం చేయడమే తన పాత్ర అని, అది తన బాధ్యత అని చెప్పారు. కన్నూరులో శుక్రవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచారసభలో అన్నామలై పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ప్రస్తుతానికి తమిళనాడులో పోటీ చేసే పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం కొనసాగించడమే తనకు అప్పగించిన బాధ్యత అని చెప్పారు. ప్రస్తుతం పుదుచ్చేరి, కేరళలో ఈనెల 7వ తేదీ వరకూ ప్రచారం ఉంటుంది. 7వ తేదీ నుంచి 23 వరకూ తమిళనాడులో బీజేపీ, ఎన్డీయే అభ్యర్థులందరి తరపున ప్రచారంలో పాల్గొంటాను. పార్టీ అప్పగించిన బాధ్యత ఇది. దానికి పూర్తి న్యాయం చేస్తాను' అని అన్నామలై చెప్పారు. కన్నూరులో బీజేపీ అభ్యర్థి సి.రఘునాథ్ తరపున ఆయన ప్రస్తుతం ప్రచారం సాగిస్తున్నారు. ఎన్డీయే కూటమితో సంప్రదింపుల అనంతరం తమిళనాడులో పోటీ చేసే 27 మంది అభ్యర్థుల జాబితాను బీజేపీ శుక్రవారం విడుదల చేసింది. తమిళనాడు బీజేపీలో 'సింహం'గా పేరున్న కె.అన్నామలైకి ఈ జాబితాలో చోటులేకపోవడం చర్చనీయాంశమైంది. అయితే అన్నామలై మాత్రం అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ప్రకటించిన అభ్యర్థులకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో అభినందనలు తెలిపారు. డీఎంకేపై విమర్శలు గుప్పించారు. బీజేపీ కార్యకర్తగా బీజేపీ, ఎన్డీయే అభ్యర్థుల విజయానికి పాటుపడతానని చెప్పారు. పార్టీ అభ్యర్థుల జాబితాను కూడా ఆయన తన ట్వీట్‌కు జతచేశారు. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ ఏప్రిల్ 23న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

## తమిళనాట 27 మందితో బిజెపి జాబితా

**- అన్నామలైకి దక్కని స్థానం - పార్టీతో దూరం పెరిగిందన్న ప్రచారం**



**చెన్నై,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ):** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే 27 మంది పార్టీ అభ్యర్థులను బీజేపీ శుక్రవారంనాడు ప్రకటించింది. కీలక నేతలైన పార్టీ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు నాగేంద్రన్, కేంద్ర మంత్రి ఎల్ మురుగన్, తమిళిసై సౌందరరాజన్‌కు పార్టీ టిక్కెట్ దక్కినప్పటికీ, పార్టీ మాజీ అధ్యక్షుడు, కీలక నేత కె.అన్నామలైకి ఈ జాబితాలో చోటుదక్కలేదు. అన్నామలై 2021 జూలై నుంచి ఏప్రిల్ 2025 వరకూ బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడుగా ఉన్నారు. అయితే ఈసారి ఎన్నికల్లో పోటీకి ఆయనను పార్టీ అధిష్ఠానం దూరంగా ఉంచింది. దీనిపై నాగేంద్రన్‌ను అడిగినప్పుడు, పార్టీ కేంద్ర నాయకత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. పార్టీ ప్రకటించిన 27 మంది కచ్చితంగా నెగ్గితీరుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో అన్నామలైకు టిక్కెట్ ఇవ్వకపోవడం వెనుక కారణాలపై తాజాగా చర్చజరుగుతోంది. బీజేపీ-అన్నాడీఎంకే మధ్య సీట్ల పంపకాలపై మొదట్నించీ అన్నామలై అసంతృప్తితో ఉన్నారు. దీనితోపాటు, బీజేపీ సునాయాసంగా నెగ్గే సీట్లను అన్నాడీఎంకే కేటాయించ లేదంటూ బీజేపీ అధిష్ఠానానికి ఆయన లేఖ రాశారు. ఈసారి పోటీకి తనను దూరంగా ఉంచాలని కూడా అధిష్ఠానాన్ని ఆయన కోరినట్టు చెబుతున్నారు. అన్నాడీఎంకేతో బీజేపీ పొత్తును అన్నామలై ఏనాడూ సమర్థించలేదు. ఎన్డీయేలోకి అన్నాడీఎంకే తిరిగి రావాలంటే అన్నామలైను బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించాలని పొత్తులకు ముందు బీజేపీ అధిష్ఠానం ముందు ఎడప్పాడి కె పళనిస్వామి షరతు పెట్టినట్టు కూడా అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ తదనంతర క్రమంలో తన తండ్రికి అనారోగ్యంగా ఉందంటూ పార్టీ అధ్యక్ష పదవికి అన్నామలై రాజీనామా చేయడం, నాగేంద్రన్ ఆ పదవిని చేపట్టడం జరిగింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో అరవకురిచ్చి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అన్నామలై పోటీ చేశారు. డీఎంకే అభ్యర్థి ఆర్.ఇలాంగో చేతిలో 24 వేల ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు.

# రాఘవచద్దాను తొలగిస్తూ ఆప్ నిర్ణయం

**-సభలో మాట్లాడే అవకాశం ఇవ్వరాదని లేఖ -ఆప్ తీరుపై మండిపడ్డ రాఘవ్ చద్దా**

**-ప్రజా సమస్యలపై గొంతెత్తితే తట్టుకోలేరా? -వీడియో విడుదల చేసిన రాఘవ్ చద్దా**




**న్యూఢిల్లీ,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ):** రాజ్యసభలో ఆమ్‌ఆద్మీ పార్టీ ఉపనేతగా ఉన్న రాఘవ్ చద్దాను ఆ పదవి నుంచి ఆప్ తొలగించడం తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా తాజాగా స్పందించారు. తానేం తప్పు చేశానంటూ పార్టీని బహిరంగంగా ప్రశ్నించారు. ఇలాంటి ప్రయత్నాలతో తన గళాన్ని అణచివేయగలరేమో గానీ.. తనను ఓడించలేరంటూ ఓ వీడియో సందేశం విడుదల చేశారు. పార్లమెంట్‌లో నాకు ఎప్పుడు మాట్లాడే అవకాశం లభించినా.. ప్రజా సమస్యలనే లేవనెత్తుతా. బహుశా నేను ప్రస్తావించే అంశాలను సభలో సాధారణంగా చర్చించరేమో. కానీ, ప్రజా సమస్యలను ఎత్తిచూపడం ఏమైనా నేరమా అని నిలదీశారు. నేనేమైనా తప్పు చేశానా? పార్లమెంట్‌లో నాకు మాట్లాడే అవకాశం ఇవ్వొద్దని మా పార్టీ స్వయంగా రాజ్యసభ సెక్రటరీకి చెప్పింది. అందుకే ఈ రోజు నేను ఈ ప్రశ్నలు అడగాల్సి వచ్చింది. ఎయిర్‌పోర్టుల్లో ఆహార ధరలు, గిగ్ వర్కర్ల సమస్యలు, టోల్ ప్లాజా దోపిడీ, టెలికాం కంపెనీల రీఛార్జ్ విధానాల సమస్యలను లేవనెత్తితే.. అది ఆమ్‌ఆద్మీ పార్టీకే ప్రయోజనం కదా అని అన్నారు. మొన్నటికి మొన్న వివిధ రకాల పన్నులుపై నిలదీశారు. దీనివల్ల పార్టీకి ఏం నష్టం జరుగుతోంది? ఎందుకు నన్ను మాట్లాడకుండా అడ్డుకుంటున్నారు? ఇలాంటి చర్యలతో నా గళాన్ని మీరు అణచివేయగలరు. కాని, ఇది నా ఓటమి కాదు. ప్రజలు నా పక్షాన ఉన్నారు. వారికోసం ఎంత దూరమైనా వెళ్తా. నేను నది లాంటి వాడిని. సమయం వచ్చినప్పుడు వరదలా విరుచుకుపడతా అని రాఘవ్ చద్దా తన వీడియోలో పేర్కొన్నారు. రాజ్యసభలో ఆమ్‌ఆద్మీ పార్టీ డిప్యూటీ లీడర్‌గా రాఘవ్ చద్దాను తొలగించిన ఆప్.. ఆ హోదాలో మరో ఎంపీ అశోక్ మిత్తల్‌ను నియమించింది. ఆప్ నిర్వహిస్తున్న కార్యకలాపాలకు చద్దా దూరంగా ఉంటుండటం, పార్టీ కార్యక్రమాలపై స్పందించక పోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. రాఘవ్ చద్దా భాజపాలో చేరనున్నట్లు ఊహాగానాలు వినిపిస్తోన్న వేళ ఈ పరిణామాలు చోటుచేసుకోవడం తీవ్ర చర్చనీయాంశ మైంది.ఎంపి రాఘవ చద్దాని ఉపనాయకుడి పదవి నుంచి తొలగించాలని గురువారం రాజ్యసభ సచివాలయానికి ఆ పార్టీ లేఖ రాసింది. సభలో రాఘవ చద్దాని మాట్లాడనివ్వకూడదని కూడా ఆ లేఖలో ఆప్ పేర్కొంది. దీనిపై ఆప్ ఎంపి రాఘవ్‌చద్దా శుక్రవారం స్పందించారు. పార్లమెంటులో ప్రజా సమస్యలను లేవనెత్తడం నేరమా? నేను ఏదైనా తప్పు చేశానా? అని ఆప్‌ని ప్రశ్నించారు. ఈ మేరకు ఓ వీడియోను ఆయన శుక్రవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. నాకు ప్రజల మద్దతు ఉంది. నా మౌనాన్ని నా ఓటమిగా పొరపాటు పడకండి అని రాఘవ్ చద్దా వీడియోలో తెలిపారు.



## క్రీడలు

## అభిషేక్ శర్మ జరిమానా కట్టాల్సిందే!



**న్యూఢిల్లీ,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ):** ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా నిన్న ఏప్రిల్ 2న ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్ మధ్య ఆసక్తికర పోరు జరిగింది. ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ 65 రన్స్ భారీగా తేడాతో ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ తొలి బోణీ కొట్టింది. అయితే తొలి గెలుపు ఆనందంలో ఉన్న ఎస్ఆర్‌హెచ్ ఓపెనర్ అభిషేక్ శర్మకు మాత్రం ఎదురుదెబ్బ తగిలింది. అభిషేక్ శర్మ మ్యాచ్ ఫీజులో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) గట్టి షాక్ ఇచ్చింది. ఐపీఎల్ నిబంధనలను ఉల్లఘించిన కారణంగా మ్యాచ్ ఫీజులో కోత విధిస్తున్న ఐపీఎల్ నిర్వాహకులు తెలిపారు. ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ శర్మ ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్లు ఐపీఎల్ నిర్వాహకులు తేల్చారు. అందుకు అనుగుణంగా అభిషేక్ మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించేందుకు బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. దీంతో పాటు అభిషేక్ శర్మకి కూడా తన ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్ బీసీసీఐ చేర్చింది. ఐపీఎల్ రూల్స్‌లోని ఆర్టికల్ 2.3 కింద లెవెల్ 1 నేరానికి పాల్పడినట్లు అభిషేక్ శర్మ అంగీకరించినట్లు తేలింది. మ్యాచ్ రిఫరీ విధించిన జరిమానాకు అభిషేక్ శర్మ స్వీకరించడంతో ఇందులో తదుపరి విచారణ లేకుండా పోయింది. అయితే అభిషేక్ శర్మ ఏ కారణంగా జరిమానా విధించారో అనే విషయాన్ని ఐపీఎల్ తన అధికారిక ప్రకటనలో స్పష్టంగా చెప్పలేదు. అయితే ఆర్టికల్ 2.3 అనేది సాధారణంగా మ్యాచ్ జరగుతున్న సమయంలో అనుచిత భాషను మాట్లాడినా.. లేదా అసభ్య పదజాలంతో దూషించే వంటి అంశాలు ఈ రూల్ కిందకి వస్తాయి. అయితే అభిషేక్ శర్మ వికెట్ పడిన క్రమంలో అది నాటౌట్‌ను అంపైర్ ఔట్‌గా ప్రకటించడంపై తీవ్ర నిరాశకు లోనయ్యాడు. దీంతో ఆ ఉద్వేగభరిత క్షణంలో అభిషేక్ శర్మ నోరు జారినట్లు చెబుతున్నారు. అయితే ఆ సంఘటన ఈ జరిమానాకు కారణం అయ్యిండొచ్చని చెబుతున్నారు. ఓ వైపు జరిమానా విధించినా.. మరోవైపు అభిషేక్ శర్మ కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అద్భుతంగా రాణించాడు. కేవలం 21 బంతుల్లో 48 పరుగులు (4 సిక్సర్లు, 4 ఫోర్లు) రాబట్టి.. సన్‌రైజర్స్ హైదరాబాద్ భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. అయితే ఇదే తరుణంలో అభిషేక్ ఓ అరుదైన మైలురాయిని చేరాడు. సన్‌రైజర్స్ టీమ్ తరపున 100 సిక్సర్లు బాదిన రికార్డు గతంలో డేవిడ్ వార్నర్ ఖాతాలో ఉండగా.. ఇప్పుడు దాన్ని అభిషేక్ శర్మ (మొత్తం 101 సిక్సర్లు) చేరుకున్నాడు. ఎంతో ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్దేశించిన 227 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించలేక కేకేఆర్ 16 ఓవర్లలోనే 161 పరుగులకే ఆలౌట్ అయ్యింది.

## కేకేఆర్‌పై గెలుపుతో నేను సంతోషంగా లేను..

**- సన్‌రైజర్స్ కెప్టెన్ ఇషాన్ కిషన్ కీలక కామెంట్స్**

**న్యూఢిల్లీ,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ):** ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు గెలుపు బోణీ కొట్టింది. గురువారం ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 65 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించడం పట్ల ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్ ఇషాన్ కిషన్ ఆనందాన్ని వ్యక్తం చేశాడు. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 226 పరుగులు చేసింది. సన్‌రైజర్స్ ప్లేయర్లలో హెన్రిచ్ క్లాసెన్ (35 బంతుల్లో 52 రన్స్) హాఫ్ సెంచరీ సాధించాడు. అభిషేక్ శర్మ (21 బంతుల్లో 48 రన్స్), ట్రావిస్ హెడ్ (21 బంతుల్లో 46 రన్స్). నితీశ్ కుమార్ రెడ్డి (24 బంతుల్లో 39 రన్స్) వేగంగా ఆడారు. కేకేఆర్ బౌలర్లలో బ్లెస్సింగ్ ముజరబాని 4, వైభవ్ అరోరా 2, కార్తిక్ త్యాగి, అనుకుల్ రాయ్‌లు చెరో వికెట్ పడగొట్టాడు. 227 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో కోల్‌కతా నైట్‌రైడర్స్ 16 ఓవర్లలో 161 పరుగులకు ఆలౌటైంది. కేకేఆర్ బ్యాటర్లలో అంగ్రిష్ రఘువంశీ (29 బంతుల్లో 52) హాఫ్ సెంచరీ చేయగా.. రింకూ సింగ్ (25 బంతుల్లో 35 పరుగులు) రాణించాడు. సన్‌రైజర్స్ బౌలర్లలో జయదేవ్ ఉనాద్కత్ 3, మలింగ, నితీశ్‌కుమార్ రెడ్డిలు చెరో 2, హర్ష్ దూబె ఓ వికెట్ తీశారు. అయితే మ్యాచ్ అనంతరం ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్ ఇషాన్ కిషన్ మాట్లాడుతూ.. ఐపీఎల్ 2026 సీజన్‌లో గెలుపు బోణీ కొట్టడం సంతోషాన్ని ఇచ్చిందన్నాడు. ఈ గెలుపు క్రెడిట్ ఓపెనర్లదేనని చెప్పుకొచ్చాడు. జట్టు ప్రదర్శనపై ఆనందాన్ని వ్యక్తం చేశాడు. కానీ వ్యక్తిగతంగా తన ఆటతీరు పట్ల సంతోషంగా లేనన్నాడు. గ్రౌండ్‌లో టీమ్ చూపిన నిబద్ధత పట్ల సంతోషంగా ఉన్నానని.. ప్రతి ఒక్కరు తమ శక్తి వంచన లేకుండా గెలుపు కోసం కృషి చేశారన్నాడు. టీమ్ నుంచి తాను కోరుకున్నది కూడా అదేనని.. ఇక ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మలు అద్భుతంగా ఆడారని మెచ్చుకున్నాడు. వారి దూకుడు కారణంగా పవర్ ప్లేలో 80 పరుగులు వచ్చాయన్నాడు. దీంతో మిగిలిన బ్యాటర్లు సింగిల్స్ తీసుకోవడానికి, పిచ్ ఎలా ఉందో అర్థం చేసుకోవడానికి అదనపు సమయం దొరికిందన్నాడు. వీరిద్దరితో పాటు ఆఖరిలో హెన్రిచ్ క్లాసెన్, నితీశ్ రెడ్డిలు గొప్పగా ఆడారన్నాడు. మొత్తంగా ఇది జట్టు విజయం అని చెప్పుకొచ్చాడు. ఇక కేకేఆర్ ఆటగాడు ఫిన్ అలెన్ ఎంతటి ప్రమాదకర ఆటగాడో అందరికి తెలుసునన్నాడు. అతడు ఒక్కసారి చెలరేగితే ఆపడం చాలా కష్టమన్నాడు. అయితే.. హర్ష్ దూబె అద్భుతమైన బంతితో అతడిని బోల్తా కొట్టించాలని తెలిపాడు. ఇక తమ బౌలర్లు అందరూ ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేశారన్నాడు. ప్రతి మ్యాచ్ నుంచి తాము ఎన్నో అంశాలను నేర్చుకుంటామన్నాడు. ముఖ్యంగా ఫీల్డింగ్‌లో తాము ఇంకాస్త మెరుగుపడాల్సి ఉందన్నాడు. ఎక్స్‌ట్రాల రూపంలో 20కి పైగా పరుగులు ఇవ్వడం సరికాదన్నాడు. ఓ టీ20 మ్యాచ్‌లో 20 లేదా 10 పరుగులు కూడా పెద్ద ముప్పుగా మారుతుందన్నాడు. కాబట్టి ఫీల్డింగ్‌ను మెరుగుపరచుకునేందుకు ప్రయత్నిస్తామన్నాడు ఇషాన్ కిషన్.

## ముస్తాఫిజుర్ వ్యవహారంలో తగ్గిన బంగ్లాదేశ్

**న్యూఢిల్లీ,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ):** భారత్- బంగ్లాదేశ్ మధ్య ఇటీవల దెబ్బతిన్న క్రికెట్ సంబంధాలు మళ్లీ మెరుగపడే దిశగా అడుగులు పడుతున్నాయి. బంగ్లాదేశ్‌లో ఏర్పడిన కొత్త ప్రభుత్వం భారత్?తో క్రికెట్ సంబంధాలు మెరుగుపర్చుకోవాలని భావిస్తోంది. ఈ మేరకు ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు పునఃప్రారంభించాలని కోరుతూ బీసీసీఐకి బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు లేఖ రాసినట్లు తెలుస్తోంది. టీమ్ఇండియా జట్టు బంగ్లాదేశ్?లో పర్యటించాలని లేఖలో ప్రస్తావించినట్లు సమాచారం. అయితే బీసీబీ లేఖ రాసిన విషయాన్ని బీసీసీఐ అధికారి ఒకరు ధ్రువీకరించారు. కానీ, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. 'బీసీబీ మాకు లేఖ పంపిన విషయం వాస్తవమే. అది మాకు అందింది. కానీ, భారత ప్రభుత్వం అనుమతి లేకుండా బంగ్లాదేశ్‌తో ఎటువంటి ద్వైపాక్షిక సిరీస్ నిర్వహించడం మాత్రం సాధ్యం కాదు' అని దీకి చెందిన ఒక సీనియర్ అధికారి వెల్లడించారు. అయితే బంగ్లాదేశ్‌కు ఒకప్పుడు 'టెస్ట్ హోదా' కల్పించడంలో భారత్? కీలక పాత్ర పోషించింది. ఇప్పుడు, బంగ్లాదేశ్ అనుసరిస్తున్న ఈ కొత్త విధానం వల్ల ఇరుదేశాల మధ్య సంబంధాలు ఎంతమేరకు మెరుగుపడతాయో వేచి చూడాలి! అయితే ఐసీసీ షెడ్యూల్ ప్రకారం ఈ ఏడాది ఆగస్టు- సెప్టెంబర్‌లో భారత్ క్రికెట్ జట్టు బంగ్లాదేశ్ పర్యటనకు వెళ్లాల్సి ఉంది. ఈ టూర్‌లో ఆతిథ్య బంగ్లాతో టీమ్ఇండియా మూడు వన్డేలు, మూడు టీ20 సిరీస్‌లు ఆడాల్సి ఉంది. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను బీసీబీ జనవరిలోనే ప్రకటించింది. అలాగే వచ్చే ఏడాది ఆసియా కప్ టోర్నమెంట్‌కు బంగ్లాదేశ్ ఆతిథ్యమివ్వాల్సి ఉంది.ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో భారత జట్టు ద్వైపాక్షిక సిరీస్ కోసం బంగ్లాదేశ్ వెళ్లే అవకాశాలు చాలా తక్కువ. అలాగే ఆసియా కప్ కోసం కూడా అక్కడికి భారత్ వెళ్లకపోతే బీసీబీ తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ముఖ్యంగా ఆసియా కప్‌ను తటస్థ వేదికకు మార్చే అవకాశాలు కూడా ఉంటాయి. ఇది బంగ్లాదేశ్‌కు ఆర్థికంగానూ, ప్రతిష్టపరంగానూ భారీ నష్టాన్ని కలిగిస్తుంది. అందుకే భారత్‌తో సంబంధాలు మెరుగుపర్చుకోకపోతే బంగ్లాదేశ్ బోర్డు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఇటీవల బంగ్లాదేశ్‌లో కొత్తగా ఏర్పాటైన తారిక్ రెహమాన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిస్థితిలో మార్పు కనిపిస్తోంది. ఐపీఎల్ ప్రసారాలపై పాత సర్కార్ విధించిన నిషేధాన్ని కూడా ఎత్తివేస్తున్నట్లు క్రీడాశాఖ కొత్త మంత్రి అమీనుల్ హక్ రీసెంట్‌గా చెప్పారు. తాము రాజకీయాలను- క్రీడలను వేర్వేరుగా చూస్తామని వ్యాఖ్యానించి భారత్‌తో సంబంధాలు కోరుకుంటున్నట్లు పరోక్షంగా చెప్పకనే చెప్పారు. ఈ కారణంగానే బీసీబీ కూడా భారత్ విషయంలో తగ్గినట్లు తెలుస్తోంది. మరి బీసీసీఐ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో ఆసక్తిగా ఉంది.

## సన్‌రైజర్స్ మ్యాచ్‌లో టర్నింగ్ పాయింట్ అదే!

**న్యూఢిల్లీ,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ):** ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు అద్భుత ప్రదర్శనతో తమ తొలి విజయాన్ని నమోదు చేసింది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై 65 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో అన్ని విభాగాల్లో ఆధిపత్యం చాటిన హైదరాబాద్ జట్టు సమగ్ర ఆటతీరుతో ఆకట్టుకుంది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 226 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ మొదటి నుంచే దూకుడుగా ఆడుతూ కేకేఆర్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. కేవలం 5 ఓవర్లలోనే జట్టుకు 70 పరుగులు జోడించి మెరుపు ఆరంభం ఇచ్చారు. హెడ్ 21 బంతుల్లో 46 పరుగులు చేసి బౌండరీల వర్షం కురిపించగా, అభిషేక్ శర్మ 21 బంతుల్లో 48 పరుగులతో వేగంగా స్కోరును పెంచాడు. ఆ ఇద్దరి జోరుతో సన్‌రైజర్స్ భారీ స్కోరు వైపు దూసుకెళ్తున్నట్లు కనిపించింది. అయితే కీలక సమయంలో వరుస వికెట్లు కోల్పోవడంతో జట్టు కొంత ఒత్తిడిలో పడింది. ముజరబాని ఒకే ఓవర్లో ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మలను ఔట్ చేయడం మ్యాచ్‌ను మలుపుతిప్పింది. మధ్య ఓవర్లలో స్కోరు నెమ్మదించినా, హెన్రిచ్ క్లాసెన్ తన అనుభవంతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. 35 బంతుల్లో 52 పరుగులు చేసి అర్ధసెంచరీ సాధించిన క్లాసెన్ జట్టుకు బలమైన స్థిరత్వం ఇచ్చాడు. మరోవైపు నితీశ్ కుమార్ రెడ్డి కూడా కీలక సమయంలో 24 బంతుల్లో 39 పరుగులు చేసి జట్టుకు ఊపునిచ్చాడు. ఈ ఇద్దరూ చివరి ఓవర్లలో వేగం పెంచడంతో హైదరాబాద్ 226 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. కేకేఆర్ బౌలర్లలో ముజరబాని నాలుగు వికెట్లు తీసి మెరుగైన ప్రదర్శన చేశాడు. వైభవ్ అరోరా రెండు వికెట్లు తీసుకోగా, కార్తిక్ త్యాగి, అనుకుల్ రాయ్ తలో వికెట్ సాధించారు. భారీ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన కోల్‌కతా నైట్‌రైడర్స్ తొలుత దూకుడుగా ఆడింది. ఓపెనర్ ఫిన్ అలెన్ తొలి ఓవర్లోనే బౌండరీలు, సిక్సర్లతో దుమ్మురేపి వేగంగా పరుగులు సాధించాడు. అయితే అతడు ఎక్కువ సేపు నిలవలేకపోయాడు. తరువాత రఘువంశీ చక్కటి బ్యాటింగ్‌తో అర్ధసెంచరీ సాధించి జట్టుకు ఆశలు కలిగించాడు. రఘువంశీ 29 బంతుల్లో 52 పరుగులు చేసి రాణించగా, రింకు సింగ్ 35 పరుగులతో సహకరించాడు. ఇద్దరూ కలిసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేశారు. కానీ రనౌట్ రూపంలో రఘువంశీ ఔట్ కావడం మ్యాచ్‌లో కీలక మలుపుగా మారింది. ఈ వికెట్ తరువాత కేకేఆర్ వరుసగా వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడింది. నితీశ్ కుమార్ రెడ్డి తన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. కీలక సమయంలో రెండు వికెట్లు తీసి ప్రత్యర్థిని కుదేలు చేశాడు. జయదేవ్ ఉనద్కత్ మూడు వికెట్లు తీసి కేకేఆర్ బ్యాటింగ్‌ను దెబ్బతీశాడు. ఇషాన్ మలింగ కూడా రెండు వికెట్లు తీసి జట్టుకు సహకరించాడు. చివరకు కోల్‌కతా జట్టు 16 ఓవర్లలో 161 పరుగులకే ఆలౌట్ అయింది. హైదరాబాద్ బౌలర్లు క్రమంగా వికెట్లు తీస్తూ మ్యాచ్‌పై పూర్తి నియంత్రణ సాధించారు. ఈ మ్యాచ్‌లో నితీశ్ కుమార్ రెడ్డి తన అద్భుత ఆల్‌రౌండ్ ప్రదర్శనకు గాను ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ కీలక పాత్ర పోషించి జట్టుకు విజయాన్ని అందించాడు. మొత్తంగా చూస్తే ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అన్ని విభాగాల్లో మెరుగైన ప్రదర్శన చేసి సమగ్ర విజయాన్ని సాధించింది. భారీ స్కోరు, కట్టుదిట్టమైన బౌలింగ్‌తో కేకేఆర్‌కు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా విజయం కైవసం చేసుకుంది.

## నా బౌలింగ్‌లో మార్పుల వెనుక ఓ 'మిస్టరీ మ్యాన్'

**- నితీష్ కుమార్ రెడ్డి ఇంట్రెస్టింగ్ కామెంట్స్**



**న్యూఢిల్లీ,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ):** కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన పోరులో నితీష్ కుమార్ రెడ్డి అద్భుతమైన ప్రతిభను కనబరిచాడు. తొలుత బ్యాటింగ్‌లో 39 పరుగులు చేసిన నితీష్, ఆ తర్వాత బౌలింగ్‌లోనూ రెండు కీలక వికెట్లు తీసి సన్‌రైజర్స్ గెలుపులో కీలక పాత్ర పోషించాడు. గత సీజన్‌లో గాయాల కారణంగా ఇబ్బంది పడిన ఈ యువ ఆటగాడు, ఈ ఏడాది తన బౌలింగ్ శైలిని పూర్తిగా మార్చుకుని ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టాడు. తన బౌలింగ్ మెరుగుపడటం వెనుక ఒక ప్రత్యేక వ్యక్తి ఉన్నారని నితీష్ వెల్లడించడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. విజయం అనంతరం నితీష్ మాట్లాడుతూ.. తన బౌలింగ్ మెరుగుదలపై పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. "నేను నా బౌలింగ్ విషయంలో నిరంతరం శ్రమిస్తుంటాను. గత ఏడాది గాయాల వల్ల సాధన చేయడానికి తగిన సమయం దొరకలేదు. కానీ ఈ సీజన్ ప్రారంభానికి ముందు ఒక వారం పాటు ఒక ప్రత్యేక వ్యక్తి పర్యవేక్షణలో శిక్షణ తీసుకున్నాను. ఆయన ఇచ్చిన సూచనలు ఇప్పుడు మైదానంలో అమలు చేస్తున్నాను. అయితే ఆ వ్యక్తి ఎవరనేది ఇప్పుడే బయట పెట్టను, త్వరలోనే వెల్లడిస్తాను" అని నితీష్ సస్పెన్స్ మెయింటైన్ చేశాడు. ఈడెన్ గార్డెన్స్ పిచ్ బ్యాటింగ్, బౌలింగ్ రెండింటికీ అనుకూలంగా ఉంటుందని నితీష్ పేర్కొన్నాడు. బ్యాటింగ్ చేస్తున్న సమయంలోనే పిచ్ నెమ్మదిగా ఉందని గమనించినట్లు చెప్పాడు. "కోల్‌కతా బౌలర్లు స్లో బౌన్సర్లు వేయడం చూశాక, మేము బౌలింగ్ చేసేటప్పుడు కూడా అదే వ్యూహాన్ని అనుసరించాలని నిర్ణయించుకున్నాను. రింకూ సింగ్ వంటి ప్రమాదకరమైన బ్యాటర్ వికెట్‌ను స్లో బంతి ద్వారానే పడగొట్టాను.

## హీట్ పెంచేస్తున్న నభా.. శారీలోనూ ఇంత గ్లామరా?



టాలీవుడ్ ఇస్మార్ట్ బ్యూటీ నభా నటేష్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఫోటోలు ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. సాధారణంగా గ్లామర్ పాత్రలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే నభా, ఈసారి బ్లాక్ శారీలో చాలా క్లాసీగా కనిపిస్తున్నారు. “ఇన్ మై శారీ ఎరా” అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్ చూస్తుంటే, తన స్టైల్ స్టేట్‌మెంట్‌ను మార్చుకోవాలని ఆమె గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు అర్థమవుతోంది. డార్క్ కలర్ నెట్టెడ్ శారీలో నభా ఇస్తున్న స్టిల్స్ ఆమెలోని కొత్త యాంగిల్‌ను బయటపెట్టాయి. సినిమా ఇండస్ట్రీలో ఒక నటి తన ఇమేజ్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవడం చాలా ముఖ్యం. నభా నటేష్ కూడా అదే బాటలో నడుస్తున్నారు. ఈ ఫోటోషూట్ చూస్తుంటే ఆమె కేవలం గ్లామర్ షోకే పరిమితం కాకుండా, విభిన్నమైన పాత్రలకు కూడా తాను సరిపోతానని మేకర్స్‌కు సంకేతాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. అసలు విషయానికి వస్తే, నభా నటేష్ ఇప్పుడు తన కెరీర్‌ను చాలా పకడ్బందీగా ప్లాన్ చేసుకుంటున్నారు. ఒక ప్రమాదం కారణంగా కొంతకాలం సినిమాలకు దూరమైన ఆమె, ఇప్పుడు మళ్ళీ తన ఫామ్‌ను నిరూపించుకునేందుకు సిద్ధమయ్యారు. కేవలం కమర్షియల్ సినిమాలే కాకుండా, కంటెంట్ ఉన్న చిత్రాలపై ఆమె దృష్టి పెడుతున్నారు. తన ఇమేజ్‌కు సరిపోయేలా విభిన్నమైన కథలను ఎంచుకుంటూ బాక్సాఫీస్ దగ్గర మళ్ళీ సత్తా చాటాలని చూస్తున్నారు. ప్రస్తుతం ఆమె చేతిలో కొన్ని క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. అందులో ముఖ్యంగా నిఖిల్ హీరోగా రాబోతున్న ‘స్వయంభూ’ సినిమాపై మంచి అంచనాలు ఉన్నాయి. ఇది ఒక పీరియడ్ డ్రామా కావడంతో నభా పాత్ర చాలా కీలకంగా ఉండబోతోందని సమాచారం. ఇవే కాకుండా ‘నాగబంధం’ అనే మరో విభిన్నమైన కథాంశంతో వస్తున్న సినిమాలో కూడా ఆమె నటిస్తున్నారు. ఈ రెండు సినిమాలు నభా కెరీర్‌కు చాలా ముఖ్యమైనవి. మరి ఆ సినిమాలు ఎలాంటి ఫలితాన్ని అందుకుంటాయో చూడాలి.

## బిగ్ డే - కంటెంట్లతో ఆకట్టుకునే ప్రయత్నం





టాలీవుడ్ మరో మంచి ఫ్రైడే కోసం ఎదురు చూస్తున్న టైంలో కంటెంట్ నమ్ముకున్న రెండు సినిమాలు ఇవాళ థియేటర్లలో అడుగు పెట్టాయి. ఆ నమ్మకంతోనే ముందు రోజు సాయంత్రం నుంచే ప్రీమియర్లు స్టార్ట్ చేశాయి. ప్రాథమికంగా వచ్చిన ఓవర్సీస్, తెలుగు రాష్ట్రాల రిపోర్ట్స్ చూస్తుంటే రెండు నిరాశపరచలేదనే కనిపిస్తోంది. ఆడియన్స్ ఇచ్చే తీర్పు ఎలా ఉండబోతోందో మధ్యానానికి క్లారిటీ వస్తుంది. స్పెషల్ షోలు దాదాపు అన్ని చోట్ల హౌస్ ఫుల్స్ కావడం విశేషం. ముందు బైకర్ విషయానికి వస్తే జనవరిలో నారి నారి నడుమ మురారితో హిట్టు కొట్టిన శర్వానంద్ ఈసారి ఎవరూ ఊహించని మేకోవర్ తో వచ్చాడు. బైక్ రేసింగ్ కాన్సెప్ట్ కావడంతో ఒంటిని కష్టపెట్టుకుని, బరువు తగ్గి చాలా డెడికేషన్ ఇచ్చాడు. ట్రైలర్ లోనే అవి బయటపడ్డాయి. రాజశేఖర్ మొదటిసారి హీరో తండ్రి పాత్రకు ఎస్ చెప్పడం అంచనాల పరంగా ప్లస్ అయ్యింది. రేసింగ్ కాన్సెప్ట్ తో పాటు ఫాదర్ సన్ ఎమోషన్ మెయిన్ హైలైట్స్ లో ఒకటిగా చెబుతున్నారు. నీహారిక కొణిదెల నిర్మాతగా వ్యవహరించిన రాకాసకు ప్రమోషన్లు పెద్ద ప్లస్ అయ్యాయి. రామ్ చరణ్ తో చేసిన పదకొండు నిమిషాల ఇంటర్వ్యూ బజ్ పెరగడానికి ఉపయోగపడింది. సంగీత్ శోభన్ టైమింగ్ మీద ఆడియన్స్ లో అంచనాలు ఉండటం, లేడీ డైరెక్టర్ మానస శర్మ ప్రమోట్ చేసుకున్న విధానం జనంలో సాఫ్ట్ కార్నర్ వచ్చేలా చేశాయి. విఎఫ్ఎక్స్, ట్విస్టులు, ఆర్టిస్టుల టైమింగ్ మీద ఫీడ్ బ్యాక్ అయితే పాజిటివ్ గా ఉంది. సోషల్ మీడియా సపోర్ట్ బానే ఉంది. ఇవాళ కనక రెండు సినిమాలు పాస్ అయితే బాక్సాఫీస్ కు మంచి ఊపు వస్తుంది. మార్చిలో దురంధర్ ది రివెంజ్ ఒక్కటే వసూళ్లు తేగా ఉస్తాద్ భగత్ సింగ్ నిరాశపరిచింది. సరైన ఫీడింగ్ లేక వేసవి వృధా అయిపోతోందని కలవపడుతున్న ట్రేడ్ వర్గాలకు రాకాస, బైకర్ సక్సెస్ కావడం చాలా అవసరం. సముతిరఖని తమిళ డబ్బింగ్ కార్మేని సెల్వం కూడా ఈ రోజే ఆడియన్స్ ముందుకు వచ్చింది కానీ టైటిల్, వీక్ ప్రమోషన్ల వల్ల జనాలను చేరలేకపోతోంది.




## లేడీ డైరెక్టర్ ట్రెండ్ సెట్ చేస్తుందా?



సినీ రంగంలో మహిళలు నటనలోకి పెద్ద సంఖ్యలోనే వస్తారు కానీ.. టెక్నికల్ సైడ్ వెళ్లే వాళ్లు తక్కువ. అందులోనూ దర్శకత్వం వైపు అడుగులు వేసే వాళ్లు మరీ తక్కువ. ఇన్నేళ్ల తెలుగు సినీ చరిత్రలో కాస్త పేరున్న లేడీ డైరెక్టర్ల లిస్టు తీస్తే అది డబుల్ డిజిట్‌కు కూడా వెళ్లదు. ఈ తరంలో చెప్పుకోదగ్గ మహిళా దర్శకురాలు అంటే నందిని రెడ్డి మాత్రమే. ఆమెలా ట్రెండీగా సినిమాలు తీస్తూ పేరు సంపాదించిన మహిళా దర్శకులు మరొకరు కనిపించరు. ఐతే ఇప్పుడు నందిని తరహాలో పురుష దర్శకులకు దీటుగా ట్రెండీ సినిమా తీయగల సత్తా ఉన్న దర్శకురాలిగా మానస శర్మ అనే కొత్తమ్మాయి ఆశలు రేకెత్తిస్తోంది. నిహారిక కొణిదెల ప్రొడక్షన్లో ఒక షార్ట్ ఫిలిం చేసి మెప్పించిన ఈ అమ్మాయి.. ఈ శుక్రవారం విడుదల కానున్న ‘రాకాస’తో ఫీచర్ ఫిలిం దర్శకురాలిగా పరిచయం అవుతోంది. ఈ సినిమా ప్రోమోలు చాలా ఆసక్తికరంగా అనిపించాయి. ఇది ప్రేక్షకులను వినోదంలో ముంచెత్తే సినిమా అవుతుందనే అంచనాలున్నాయి. మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాలతో ఎంటర్టైన్మెంట్‌కు కేరాఫ్ అడ్రస్ అయిపోయాడు సంగీత్ శోభన్. మంచి కామెడీ టైమింగ్‌కు ఉన్న అతడితో హార్రర్ టచ్ ఉన్న ఫాంటసీ సినిమా చేయాలనుకోవడంతోనే మానస సగం విజయం సాధించింది. ప్రోమోల్లో కథాంశం, విజువల్స్, ఫన్ ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నాయి. మానస నరేషన్ చాలా ట్రెండీగా అనిపించింది టీజర్, ట్రైలర్లలో. ఆమెను నమ్మి నిహారిక పెద్ద బడ్జెట్టే పెట్టినట్లు కనిపిస్తోంది. ఈ సినిమాకు అడ్వాన్స్ బుకింగ్స్ కూడా బాగున్నాయి. కావాల్సిందల్లా మంచి టాకే. ఈ రోజు రాత్రి ప్రిమియర్స్ నుంచి టాక్ వచ్చిందంటే ‘రాకాస’ మంచి విజయం సాధించబోతున్నట్లే. అదే జరిగితే తెలుగు సినిమాకు చాన్నాళ్ల తర్వాత ఓ ట్రెండీ లేడీ డైరెక్టర్ దొరికినట్లే. మానస లుక్స్.. ‘ఓయ్’ సినిమాలో షామిలిని తలపించేలా ఉండడంతో ఆమె ఆల్రెడీ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ఇక కంటెంట్‌తోనూ మెప్పించిందంటే తన పేరు మార్మోగడం ఖాయం.

## అట్లీ రిస్క్ తీసుకోలేకపోతున్నారా?




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు వస్తుందంటే సోషల్ మీడియాలో రచ్చ మామూలుగా ఉండదు. ఏప్రిల్ 8వ తేదీ కోసం అభిమానులు చాలా కాలంగా వెయిట్ చేస్తున్నారు. ముఖ్యంగా అట్లీ దర్శకత్వంలో రాబోతున్న తన 22వ సినిమా ఏఏ22 నుంచి ఏదైనా ఒక అదిరిపోయే వీడియో అప్డేట్ వస్తుందని అందరూ ఆశించారు. అయితే ఇప్పుడు సీన్ మారింది. ఫ్యాన్స్ ఆశించిన గ్లింప్స్ లేదా టీజర్ ఈసారి రావడం లేదని తెలుస్తోంది. దీనికి బదులుగా కేవలం టైటిల్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌తోనే మేకర్స్ సరిపెట్టే అవకాశం ఉంది. సాధారణంగా ఇంత పెద్ద ప్రాజెక్టుల విషయంలో గ్లింప్స్ రాకపోవడం అనేది అభిమానులకు కొంత నిరాశ కలిగించే విషయమే. కానీ ఇక్కడ దర్శకుడు అట్లీ ఒక పక్కా ప్లాన్‌తోనే అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. కేవలం పుట్టినరోజు కదా అని ఏదో ఒక వీడియోను హడావిడిగా వదలడం కంటే, క్వాలిటీ విషయంలో రాజీ పడకుండా ఉండటమే మేలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే రిస్క్ తీసుకోకుండా కేవలం ఒక పవర్‌ఫుల్ పోస్టర్‌తోనే సినిమాపై ఉన్న క్రేజ్‌ను మెయింటైన్ చేయాలని టీమ్ డిసైడ్ అయ్యింది. అసలు విషయానికి వస్తే, ఈ అప్డేట్ ఆగిపోవడానికి ప్రధాన కారణం విజువల్ ఎఫెక్ట్స్ అని తెలుస్తోంది. ఇదొక సైన్స్ ఫిక్షన్ సినిమా కావడంతో గ్రాఫిక్స్ పనితనం చాలా కీలకం. ప్రస్తుతం అనుకున్న స్థాయిలో విజువల్ అవుట్‌పుట్ రాకపోవడంతో, అరకొర విజువల్స్‌తో టీజర్‌ను రిలీజ్ చేయడం కంటే దాన్ని పక్కన పెట్టడమే ఉత్తమమని మేకర్స్ నిర్ణయించుకున్నారు. ఏదో ఒక వీడియోను రిలీజ్ చేసి ఆ తర్వాత నెగిటివ్ బజ్ తెచ్చుకోవడం కంటే, పర్ఫెక్ట్ టైమ్ కోసం వెయిట్ చేయడం మంచి స్ట్రాటజీ అని చెప్పొచ్చు. ఇటీవలి కాలంలో పెద్ద సినిమాలకు సోషల్ మీడియాలో మొదట్లో చిన్న నెగిటివ్ టాక్ వచ్చినా అది సినిమా ఫలితంపై గట్టి ప్రభావం చూపుతోంది. ఒకసారి నెగిటివ్ ఇంప్రెషన్ పడితే దాన్ని మళ్ళీ పాజిటివ్ గా మార్చుకోవడానికి చిత్ర బృందం చాలా కష్టపడాల్సి వస్తోంది. అల్లు అర్జున్ కెరీర్‌లోనే ఇది అత్యంత భారీ బడ్జెట్ సినిమా కావడంతో, మొదటి అడుగులోనే ఎలాంటి తప్పులు జరగకూడదని అట్లీ చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. మంచి కంటెంట్ ఉన్నప్పుడు అది కొంచెం ఆలస్యంగా వచ్చినా ఆడియన్స్ రిసీవ్ చేసుకుంటారు. ఇక మేకర్స్ ఇవ్వబోయే అప్డేట్ ఎలా ఉంటుందో చూడాలి.



# బిజినెస్ న్యూస్



## రూపాయి తెచ్చిన లాభాలు



రూపాయిలో స్పెక్యులేటివ్ ట్రేడ్ నియంత్రణకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చర్యలు చేపట్టడంతో డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ గణనీయంగా పుంజుకుంది. గురువారం రూపాయి ట్రేడింగ్ డాలర్‌తో పోలిస్తే 94.62 వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత 188 పైసలు పెరిగి 92.82 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 152 పైసల లాభంతో 93.18 వద్ద ముగిసింది. 2013 తర్వాత డాలర్‌తో పోలిస్తే, రూపాయి విలువకు అత్యధిక ఒక రోజు లాభం ఇదే. రూపాయి గణనీయంగా పుంజుకోవడం స్టాక్ మార్కెట్‌కు ఎనలేని సానుకూలత తెచ్చిపెట్టింది. భారీ నష్టాలతో ఆరంభమైన సెన్సెక్స్, రోజులో కనిష్ఠ స్థాయి నుంచి సుమారు 2,000 పాయింట్లు కోలుకుని, లాభాల్లో ముగిసింది. ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు ఉపకరించాయి. బ్రెంట్ ముడి చమురు 7.67% పెరిగి 108.90 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లన్నీ నష్టాల్లో ముగియగా.. ఐరోపా మార్కెట్లు ప్రతికూల ధోరణిలోనే ఆరంభమయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 872 పాయింట్ల నష్టంతో 72,262.05 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,134.32) ఆరంభమైంది. ఆ తర్వాత నష్టం 1588 పాయింట్లకు చేరి, సూచీ 71,545.81 పాయింట్లకూ దిగివచ్చింది. అక్కడ నుంచి పుంజుకుంటూ వచ్చిన సూచీ.. చివరకు 185.24 పాయింట్ల లాభంతో 73,319.55 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడే గరిష్ఠమైన 73,568.54 ప్రకారం చూస్తే.. కనిష్ఠ స్థాయి నుంచి సూచీ 2,023 పాయింట్లు పుంజుకుంది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 33.70 పాయింట్లు పెరిగి 22,713.10 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 22,182.55 వద్ద కనిష్ఠాన్ని; 22,782.30 వద్ద గరిష్ఠాన్ని తాకింది. మూడు రోజులే ట్రేడింగ్ జరిగిన ఈ వారంలో మొత్తం మీద సెన్సెక్స్ 264 పాయింట్లు; నిఫ్టీ 107 పాయింట్లు నష్టపోయాయి. సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 11 మినహా మిగతావన్నీ లాభాల్లోనే ముగిశాయి. ఐటీ రంగానికి చెందిన హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 3.47%, టెక్ మహీంద్రా 2.67%, ఇన్ఫోసిస్ 1.9%, టీసీఎస్ 1.8% అధికంగా లాభపడ్డాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.21%, బజాజ్ ఫైనాన్స్ 1.13% పెరిగాయి. ఏషియన్ పెయింట్స్ 2.46%, ఎటర్నల్ 2.13%, సన్‌ఫార్మా 1.96%, ఎన్‌టీపీసీ 1.33%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.31% తగ్గాయి. సాయి పేరెంటెరల్స్ షేరు, ఇష్యూ ధర రూ.392తో పోలిస్తే బీఎస్ఈలో 3.32% అధికంగా రూ.405 వద్ద ఈ షేరు నమోదైంది. చివరకు 3.67% లాభంతో రూ.406.40 వద్ద ముగిసింది. వ్యాపార లక్ష్యాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తూ, నియంత్రణ నిబంధనలను కచ్చితంగా పాటిస్తామని, కార్యకలాపాల్లో పారదర్శకత అవలంబిస్తామని సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. అనిల్‌కుమార్ తెలిపారు. హెచ్‌బీఎల్ ఇంజినీరింగ్‌కు వారణాసిలోని బనారస్ లోకోమోటివ్ వర్క్స్ నుంచి రూ.179.79 కోట్ల కాంట్రాక్టు లభించింది. రైలు ఇంజిన్లలో అమర్చే అత్యంత ఆధునిక కవచ్ 4.0 ఆన్‌బోర్డు పరికరాల సరఫరా, పరీక్షలు లాంటి బాధ్యతలను హెచ్‌బీఎల్ చేపట్టనుంది. టెలికాం, పర్యావరణ రంగాల నుంచి రూ.42.50 కోట్ల విలువైన పనులను బొండాడ ఇంజినీరింగ్ దక్కించుకుంది. తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ నుంచి కమ్యూనికేషన్ టవర్లు, పరికరాల గదుల సరఫరాకు ఆర్డర్ లభించింది.

## మహీంద్రా వాహనాల ధరల పెంపు




ముంబయి: ఈనెల 6 నుంచి విద్యుదేతర ఎస్‌యూవీలు, వాణిజ్య వాహనాల ధరలను 2.5% వరకు పెంచనున్నట్లు మహీంద్రా అండ్ మహీంద్రా గురువారం ప్రకటించింది. సంప్రదాయ ఇంధన ఇంజిన్ల (ఐసీఈ)తో నడిచే ఎస్‌యూవీలు, వాణిజ్య వాహనాల సగటు ధరలు 1.6% పెరుగుతాయని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. మోడల్, వేరియంట్‌ను బట్టి ధరల పెంపు వేర్వేరుగా ఉంటుందని పేర్కొంది. కంపెనీ ఇటీవల ఆవిష్కరించిన ఎక్స్‌యూవీ7ఎక్స్ఓ వాహనం ధర తొలి 40,000 మంది కొనుగోలుదార్లకు మాత్రం పెరగదని, ఇతరులకు పెంపు వర్తిస్తుందని వివరించింది. విద్యుత్తు మోటార్‌సైకిల్ రోడ్‌స్టర్ 9.1 కేడబ్ల్యూహెచ్ ధరను రూ.60,000 తగ్గిస్తున్నట్లు ఓలా ఎలక్ట్రిక్ ప్రకటించింది. సంస్థ సొంతంగా అభివృద్ధి చేసి, ఉత్పత్తి చేస్తున్న 4680 బ్యాటరీసెల్ ధరకు అనుగుణంగా ఈ బైక్ ధరను తగ్గిస్తున్నట్లు వివరించింది. గిగాఫ్యాక్టరీలో సెల్ ఉత్పత్తి పెరిగే కొద్దీ, వ్యయాలు తగ్గుతున్నాయని, ఈ ప్రయోజనాన్ని కొనుగోలుదార్లకు బదిలీ చేస్తున్నట్లు ఓలా ఎలక్ట్రిక్ వెల్లడించింది. ఇప్పటివరకు ఈ బైక్ ధర రూ.1,89,999 కాగా, ఇకపై రూ.1,29,999 అవుతుంది. కొన్ని ఛానళ్ల ద్వారా, పరిమిత సంఖ్యలో వాహనాలే ఈ ధరకు లభిస్తాయని సంస్థ పేర్కొంది. ఏప్రిల్ 3న సాయంత్రం 6:00 – 9:00 గంటల మధ్య సంస్థ వెబ్‌సైట్‌లో ఈ బైక్‌ను బుక్ చేసుకోవచ్చు.



## ఫార్మాపై నూరు శాతం టారిఫ్.. భారత కంపెనీలపై ప్రభావమెంత?

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి టారిఫ్ వార్ ప్రకటించారు. విదేశాల నుంచి దిగుమతయ్యే పేటెంట్ పొందిన మందులపై నూరు శాతం పన్ను విధించారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ఆయన సంతకం చేశారు. ఔషధాలు, ఔషధ ముడి పదార్థాల దిగుమతుల వల్ల జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లుతోందని, అందుకే సుంకాలు విధిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫార్మాపై సుంకాలకు వైట్‌హౌస్ సిద్ధమవుతోందన్న వార్తల నేపథ్యంలో గురువారం దేశీయ ఫార్మా స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. ఇంతకీ టారిఫ్‌ల ప్రభావం భారతీయ కంపెనీలపై ఏ మేర ఉంటుంది? ‘మోస్ట్ ఫేవర్డ్’ కింద ఒప్పందాలు చేసుకున్న ఫార్మా కంపెనీలు అమెరికాలో ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటుచేస్తే.. వాటి పేటెంట్, ఇతర ఉత్పత్తులకు ఎలాంటి సుంకాలూ ఉండవు. అమెరికా ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోని కంపెనీల పేటెంట్ మందులపై 100% వరకు దిగుమతి సుంకం విధిస్తారు. ధరల ఒప్పందం కుదుర్చుకోకుండా ఒకవేళ ఫ్యాక్టరీ నిర్మిస్తున్నట్లయితే ప్రస్తుతం 20% పన్ను ఉంటుంది. అది నాలుగేళ్లలో 100%కి పెరుగుతుంది. ప్రస్తుతానికి జనరిక్, బయోసిమిలర్, అత్యవసర మందులకు ఈ పన్ను నుంచి మినహాయింపు ఇచ్చారు. దేశీయ కంపెనీలు అత్యధికంగా జనరిక్ మందులను అమెరికాకుకు ఎగుమతి చేస్తుంటాయి. ఈ మందులపై ప్రస్తుతం పన్ను లేదు కాబట్టి, భారత ఫార్మా రంగానికి టారిఫ్‌ల భారం ప్రస్తుతానికి లేనట్లే. భవిష్యత్తులో జనరిక్ మందులను కూడా సమీక్షిస్తామని వైట్‌హౌస్ పేర్కొంది. ఒకవేళ జనరిక్ మందులపై పన్నులు విధిస్తే, భారత కంపెనీలకు భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉంది. అయితే, డాక్టర్ రెడ్డీస్, సన్‌ఫార్మా, బయోకాన్ వంటి కంపెనీలు జనరిక్ మందులతో పాటు పేటెంట్ మందులు కూడా అమెరికాలో విక్రయిస్తున్నాయి. కాబట్టి ఆయా కంపెనీలపై పన్నుల భారం పడే అవకాశం ఉంటుంది. టారిఫ్‌లపై చర్చలు జరిపేందుకు పెద్ద కంపెనీలకు 120 రోజులు, మిగతా సంస్థలకు 180 రోజుల సమయమిచ్చింది.



## టీటీడీకి మినీ ట్రక్ విరాళం



**తిరుమల,ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అశోక్ లేల్యాండ్ సంస్థ శుక్రవారం ఉదయం టీటీడీకి రూ. 8.75 లక్షలు విలువైన దోస్త్ ప్లస్ ఎక్సెల్ మినీ ట్రక్‌ను విరాళంగా అందించింది. ఈ మేరకు ఆ సంస్థ ఏరియా మేనేజర్ మహ్మద్ నజీరుద్దిన్ శ్రీవారి ఆలయం ముందు వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి టీటీడీ అదనపు ఈవో సి. హెచ్.వెంకయ్య చౌదరికి వాహనం తాళాలను అందజేశారు.

## బిజెపి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులుగా పెనుబాల హర్షవర్ధన్



**తిరుపతి,ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భారతీయ జనతా పార్టీ ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ , బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ ఆదేశాల ప్రకారం తిరుపతి జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో తిరుపతి జిల్లా ఎస్సీ మోర్చ అధ్యక్షులుగా పెనుబాల హర్షవర్ధన్‌ని నియమించడం జరిగింది. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, బీజేపి రాష్ట్ర మహిళా మోర్చనాయకురాలు గాలి పుష్పలత , రాష్ట్ర దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ కొండేటి ప్రేమ్ , రాష్ట్ర ఎస్సీ మోర్చ ఐటి సెల్ కన్వీనర్ కాకి లక్ష్మి నరేష్ , బిజెవైఎం రాష్ట్ర నాయకులు జీవన్ రాయల్ , తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి డా. కదిరి నరేష్ బాబు, బీడీ బాలాజీ, తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు వేదవతి రాయల్, మల్ల కుప్పం శేఖర్, ప్రశాంతి రాజు, బిజెవైఎం తిరుపతి జిల్లా అధ్యక్షుడు బండారు పార్ధసారధి, మైనార్టీ మోర్చా తిరుపతి జిల్లా అధ్యక్షుడు మస్తాన్ , కిసాన్ మోర్చ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నాగరాజు, డా. పెనుబాల చంద్రశేఖర్, గవ్వల అశోక్ , తిరుపతి వెస్ట్ మండల అధ్యక్షుడు తెల్లాకుల శ్రీధర్ , నార్త్ మండల అధ్యక్షుడు , ప్రభాకర్ నాయుడు , మాజీ మండల అధ్యక్షుడు శరత్ కుమార్ వన్నెరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెనుబాల హర్ష వర్ధన్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్‌కి, రాష్ట్ర ఎస్సీ మోర్చ అధ్యక్షుడు పనతల సురేష్‌కి, , రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సన్నారెడ్డి దయాకర రెడ్డికి, నాగోతు రమేష్ నాయుడుకి, బీజేపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కి, టీటీడీ పాలక మండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డికి, ఆంధ్ర ప్రదేశ్ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వర ప్రసాద్‌కి, తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్‌కి ధన్యవాదాలు తెలియజేశారు.

## నేడు ఎస్వీయూ ఆరోగ్య కేంద్రంలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం

### - స్విమ్స్ పింక్ బస్ సహకారంతో నిర్వహణ

**తిరుపతి, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం లోని ఆరోగ్య కేంద్రంలో ఈ నెల 4 వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించనున్నాం. స్విమ్స్ పింక్ బస్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నాం. ఈ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరాన్ని ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ టి. నరసింగరావు, స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్వీ కుమార్, స్విమ్స్ కార్డియాలజీ హెడ్ డాక్టర్ వనజాక్షమ్మ, ఎస్వీయూ రెక్టార్ ప్రొఫెసర్ సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. భూపతి నాయుడు చేతుల మీదుగా ప్రారంభించనున్నాం. ఈ అవకాశాన్ని యూనివర్సిటీలోని విద్యార్థులు ఉద్యోగులు అందరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరుతున్నాం.

## అధికారుల పాలన ప్రారంభం

**రామసముద్రం,ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలంలోని గ్రామ పంచాయతీలలో సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ జీఓ జారీ చేశారు. ఆర్ నడింపల్లి, కేసీ పల్లి, మూగవాడి, కమ్మవారి పల్లికి ఎంపీడీవో లతీఫ్ ఖాన్‌ను నియమించారు. పెద్దకురుపల్లి, చొక్కండ్లపల్లి, అరికెల గ్రామాలకు తహసీల్దార్ మహమ్మద్ అజారుద్దీన్‌ను నియమించగా, కాపల్లి, చెంబకూరు, మాలేనత్తం గ్రామాలకు డిప్యూటీ ఎంపీడీవో కృష్ణవేణిని బాధ్యతలు అప్పగించారు. అలాగే రామసముద్రం, ఊలపాడు, నారిగాని పల్లికి డిప్యూటీ ఎంపీడీవో అన్నపూర్ణను ప్రత్యేక అధికారిగా నియమించారు. కురిజల మానేవారిపల్లికి వ్యవసాయ అధికారి జాఫర్‌ను, ఏలవ నెల్లూరు, మినికి గ్రామాలకు ఎంఈవో-1 హేమలతను, ఎలకపల్లి, రాగిమాకులపల్లికి ఎంఈవో-2 ఆంజనేయులను నియమించినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

## టిడిపి మండల అధ్యక్షుడిగా శివకుమార్ నాయుడు



**సత్యవేడు, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సత్యవేడు టిడిపి మండల అధ్యక్షులుగా పరుచూరి శివకుమార్ నాయుడు నియమితులయ్యారు. బాలకృష్ణాపురం గ్రామానికి చెందిన పరుచూరి శివకుమార్ నాయుడు టిడిపి పార్టీలో క్రియాశీలంగా వ్యవహరిస్తూ గతంలో జరిగిన సార్వత్రిక,స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి విశేషంగా కృషి చేశారు. దీన్ని గుర్తించడంతోపాటు నియోజకవర్గ టిడిపి ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి అండదండలు పుష్కలంగా లభించడంతో టిడిపి మండల అధ్యక్షుని పదవి శివ కుమార్ నాయుడిని వరించింది. టిడిపి మండల అధ్యక్షుల స్థానానికి స్థానికంగా ఇద్దరు ముగ్గురు గట్టిగా పోటీ ఇచ్చిన చివరకు శివకుమార్ రాయుడు వైపే టిడిపి హై కమాండ్ మొగ్గు చూపింది. ఈ నేపథ్యంలో టిడిపి మండల అధ్యక్షుల నియామకానికి సంబంధించిన జాబితా రెండు రోజుల క్రితమే తిరుపతి టిడిపి పార్లమెంటు అధ్యక్షురాలు పనబాకలక్ష్మికి చేరడంతో శుక్రవారం ఈ మేరకు జాబిత విడుదల చేశారు.




## ముక్కంటి సేవలో సినీ నటి శ్రేయ శరణ్



**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శివయ్య దర్శనం మనస్సుకు ఎంతో ప్రశాంతతను ఇస్తుందని సినీ నటి శ్రేయ శరణ్ తెలిపారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకుని గురుదక్షిణామూర్తి వద్ద వేద పండితులచే ఆశీర్వచనం తీసుకున్నారు. శ్రేయ శరణ్ కు బోర్డు సభ్యురాలు కోలా విశాలాక్షి స్వామి అమ్మవార్ల చిత్రపటం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ శివయ్య ఆశీస్సులతోనే పలు సినిమాల్లో నటించే అవకాశాలు వస్తున్నాయన్నారు. శివపార్వతుల దీవెనల కోసం శ్రీకాళహస్తీశ్వరాలయం కు వచ్చినట్లు వివరించారు.

# 'రోటరీ హ్యూమన్' ద్వారా తల్లిపాలు లేని కొరత తీరుస్తున్నారు

### - డాక్టర్ల సూచన మేరకు చిన్నారులు అందిస్తున్నారు - తల్లిపాలు స్వీకరించడం ఇవ్వడం రెండు ఉచితమే - జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్

**తిరుపతి, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల నందు రోటరీ క్లబ్ తిరుపతి వారి ద్వారా తల్లిపాల నిధి ఏర్పాటు చేసి తల్లిపాలు లేని చిన్నారులకు ఆరోగ్యవంతమైన తల్లిపాలను అందించడం జరుగుతున్నదని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం తిరుపతి ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి నందు ఏర్పాటుచేసిన రోటరీ హ్యూమన్ మిల్క్ బ్యాంక్ రెండు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మిల్క్ బ్యాంకు ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోటరీ హ్యూమన్ మిల్క్ క్లబ్ ఏర్పాటు చేసి తల్లిపాలు లేని పిల్లలకు తల్లిపాలన అందించి ఆ కొరతను తీరుస్తున్నారని పేర్కొన్నారు. సేకరించిన తల్లిపాలను పాశ్చురైజషన్ చేసి నిల్వ ఉంచి శిశువులకు అందించడం జరుగుతుందన్నారు. తల్లిపాలను సేకరించి శిశువులకు అందించే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. హ్యూమన్ మిల్క్ బ్యాంక్ సేవలు విస్తృతపరచి మధ్యతరగతి తల్లలు కూడా ఇచ్చే విధంగా, ప్రోత్సహం చేయాలని సలహా సూచనలు ఇచ్చారు. ఈ హ్యూమన్ మిల్క్ బ్యాంకు కఠిన మైన భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నందుకు, హ్యూమన్ మిల్క్ బ్యాంకు నందు గత సంవత్సరశీ కంటే ఈ సంవత్సరశీ లో ఎక్కువ సేవలు అందించినందులకు రోటరీ క్లబ్ అధికారులను,హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ తో పాటు వైద్యధికారులను, నర్సింగ్ సిబ్బందికి అభినందనలు తెలియచేసారు. బ్లడ్ డొనేషన్ బ్యాంక్ నిర్వహించడానికి 20 సం" క్రితం చాలా అపోహలు ఉండేవని, ప్రస్తుతం బ్లడ్ డొనేషన్ కూడా చాలా వరకు 70% నుండి 80% వరకు డిమాండ్ వున్నదన్నారు. అలాగే ప్రస్తుతం భారతదేశంలో 10 సం "నుంచి హ్యూమన్ మిల్క్ బ్యాంక్ లు నిర్వహించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా గత 5 -6 సంవత్సరాల నుండి ఈ హ్యూమన్ మిల్క్ బ్యాంక్ లు వివిధ రాష్ట్రాలైన తమిళ నాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ మొదలగు రాష్ట్రాలలో విస్తరణ చెందాయన్నారు. ఆంధ్రప్రదేశ్ లో



ముఖ్యంగా వైజాక్, కాకినాడ, విజయవాడ, అనంతపురం, తిరుపతి లో ఉన్నాయని, తిరుపతి లో ఎనలైజర్ తో కూడిన హ్యూమన్ మిల్క్ బ్యాంక్ ఉన్నందున, తల్లి పాలను కలెక్షన్ చేయుట, నిల్వ చేయుట, శుద్ధి చేయుట మరియు శిశువులకు తల్లి పాలు ఇవ్వుట జరుగుతున్నదన్నారు. తల్లికి పాలు పడక పోతే, అకాలశీగా పుట్టిన పసి బిడ్డలకు, బరువు తక్కువ బిడ్డలకు ఈ పాలు ఇస్తారన్నారు. అన్ని పరీక్షలు నిర్వహించిన తరువాతనే పిల్లలకు పాలను అందిస్తారు కాబట్టి శిశువులకు ఇన్ఫెక్షన్ రాదన్నారు. శిశువులకు మంచి పోషణ, అభివృద్ధి, వ్యాధులు నుండి రక్షణ కలుగుతుందన్నారు. తల్లిపాలు శిశువుకు తగిన శక్తి, వేడి, బిడ్డకు కావలసిన తగిన నీరు అందించడంతో పాటు సులభంగా జీర్ణం అవుతాయన్నారు. కావున ప్రతి తల్లి, పుట్టిన శిశువుల కు తల్లి పాలనే ఇవ్వాలని, మరియు తల్లి పాలనే 6 నెలలు వరకు కొనసాగించాలని, తద్వారా కూడా బిడ్డ కు అనుబంధ ఆహారం తో పాటు తల్లి పాలు కొనసాగిశీచ వచ్చని తెలియచేశా రు. ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టు ద్వారా ఈ హ్యూమన్ మిల్క్ బ్యాంకు ద్వారా చాలా మంది 8,288 శిశువులకు పాలు అందించడం జరిగిందని, లబ్ది పొందారని వీటి వలన 50% వరకు నవజాత శిశువు మరియు సంవత్సర"లోపు శిశు మరణాలను తగ్గించి, శిశువుల ఆరోగ్యాన్ని పెంపొందించినట్లు తెలిపారు. పాశ్చత్య దేశాల్లో మహిళలు ఉద్యోగ రీత్యా శిశువులకు అందుబాటులో లేకపోవుట వలన ముందుగా ఈ హ్యూమన్ మిల్క్ బ్యాంకులు నిర్వహించడం జరిగిందని మరియు ప్రీ టర్మ్ బేబీస్, లో బర్త్ బేబీస్, తీవ్రఅనారోగ్యశీ తో వున్న శిశువులకు పాశ్చరైజ్ చేసిన దాతల పాలు అందించడం లో చాలా కీలకం. ఈ పాలు నెక్రో టైజింగ్ ఏంటరోకోలైటీ వంటి వ్యాధుల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్థాయి. తల్లి పాలు అందుబాటులో లేనప్పుడు నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్‌యూనిట్స్‌కు ఇవి సహాయపడుతాయి. ప్రతి రోజు తిరుపతి లో ఒకటి /రెండు వీదులలో హ్యూమన్ మిల్క్ బ్యాంకు గురించి అవగాహన కల్పించాలని, హ్యూమన్ మిల్క్ ని సేకరించుట కొరకు అవసరమైన తగిన సదుపాయాలు కల్పించుట కొరకు అవసరం మేరకు స్టేట్ హెల్త్ చీఎవీ డైరెక్టర్ వారితో మాట్లాడి కావలసిన వసతులు కల్పిస్తామని తెలిపారు. ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ డా. ప్రమీలదేవి మాట్లాడు హ్యూమన్ మిల్క్ బ్యాంకు ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల, తిరుపతి నందు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. తిరుపతి రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ రాజేంద్ర శెట్టి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో మొట్ట మొదటగా ఎనలైజర్ తో కూడిన రోటరీ తల్లి పాల నిధి 3వ తేదీ ఏప్రిల్ 2024 సం. లో ఈ వైద్యశాలలో 35 లక్షల రూ. తో రోటరీ గ్లోబల్ గ్రాంట్ మరియు రోటరీ క్లబ్ తిరుపతి మరియు రోటరీ క్లబ్ అఫ్ గ్రీన్ టిన్ మలేషియా సంయుక్తముగా నిర్వహించడం మరియు సేవలు అందిచడం చాలా సంతోషం అని తెలిపారు. అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా రమాదేవి మాట్లాడుతూ తల్లి పాలు దానం చేసిన ప్రతి తల్లికి అభినందనలు తెలిపారు. రోటరీ మిల్క్ బ్యాంక్ చైర్మన్ దామోదరమ్ గత 2 సం.. రాలుగా సేకరించిన తల్లి పాలు, అందించిన శిశువు వివరాలు తెలియచేసారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డా శ్రీహరి, డి ఎం అండ్ హెచ్ ఓ డా బాలకృష్ణ నాయక్, రుయా మెడికల్ సూపరింటెండెంట్ డా మనోహర్, ఎస్వీ మెడకల్ కాలేజ్ పీజీ అకాడమిక్ వైస్ ప్రిన్సిపల్ డా కిరీటి వైస్ ప్రిన్సిపాల్, ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల సివిల్ సర్జన్ ఆర్ఎంఓ, తదితరులు పాల్గొన్నారు. తల్లి పాలు దానం చేసిన తల్లులు వారి కుటుంబ సభ్యుల కు రోటరీ క్లబ్, తిరుపతి వారి తరపున ప్రతి ఒక్కరికీ శాలువా, మెమెంటో, సర్టిఫికెట్స్ ను కలెక్టర్ వారి చేతుల మీదుగా అందచేశారు మరియు హ్యూమన్ మిల్క్ బ్యాంకు లో పని చేసిన స్టాఫ్ నర్సస్ కు సర్టిఫికెట్స్ ఇవ్వడం జరిగింది.

## కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులపై ప్రత్యేక తనిఖీలు



**తిరుపతి, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలో ఇటీవల జరుగుతున్న బస్సు ప్రమాదాల నేపథ్యంలో, తిరుపతి జిల్లాలో గత వారం రోజులుగా మోటార్ వాహన తనిఖీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీ కొర్రపాటి మురళీమోహన్ ఆదేశాల మేరకు, సూళ్లూరుపేట మరియు రేణిగుంట ప్రాంతాలలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులపై విస్తృత తనిఖీలు నిర్వహించబడ్డాయి. ఈ తనిఖీలలో మొత్తం 1100 బస్సులను పరిశీలించగా, మోటార్ వాహన చట్ట నియమ నిబంధనలను ఉల్లంఘించిన 122 బస్సులపై కేసులు నమోదు చేశారు. అదేవిధంగా ~~~ 119 నిబంధనలు ఉల్లంఘించిన 6 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అన్ని వాహనాలపై మొత్తం రూ.16 లక్షల అపరాధ రుసుము మరియు పన్ను వసూలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి మాట్లాడుతూ, అన్ని స్లీపర్ బస్సులు తప్పనిసరిగా ఆటోమోటివ్ ఇండియన్ స్టాండర్డ్స్ (~~~ 052 మరియు ~~~ 119) నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ముఖ్యంగా, స్లీపర్ బస్సులలో అత్యవసర ద్వారాలు నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని, అలాగే డ్రైవర్లు అతివేగంగా వాహనాలను నడపరాదని హెచ్చరించారు. ఈ రోజు బెంగళూరు నుండి గౌహతి వెళ్తున్న ఒక స్లీపర్ బస్సులో పరిమితికి మించి 25 మంది ప్రయాణికులు ఉన్నట్లు, అలాగే అత్యవసర ద్వారాలు లేకపోవడం గమనించిన మోటార్ వాహన తనిఖీ అధికారి శ్రీ వనం వెంకటసుబ్రహ్మణ్యం వాహనాన్ని సీజ్ చేయడం జరిగింది. ఈ ప్రత్యేక తనిఖీలలో మోటార్ వాహన తనిఖీ అధికారులు బృందాలుగా శ్రీ దామోదర్ నాయుడు, శ్రీనివాసరావు, చంద్రశేఖర్, అతికానాజ్, మోహన్ కుమార్, రమణ నాయక్, ఆంజనేయ ప్రసాద్, వర్మ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో రోడ్డు భద్రతను మెరుగుపరచడం మరియు ప్రయాణికుల ప్రాణాలను రక్షించడం లక్ష్యంగా ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు.


## నేతన్నల జీవితాల్లో వెలుగులు



**నారాయణవనం, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కూటమి ప్రభుత్వం నేతన్నల పక్షపాతిగా మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వనున్నట్లు ప్రకటించిన సందర్భంగా. నారాయణ వనం మండలంలోని నేతన్నలు హర్షం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా నారాయణవనంలోని బీసీ కాలనీలో సత్యవేడు నియోజకవర్గ టిడిపి ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కూరపాటి శంకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదవాడి సంక్షేమమే లక్ష్యంగా గతంలో ఎన్నడూ లేని విధంగా చేనేత కార్మికుల కష్టాలను గుర్తించి వారికి ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ప్రకటించడంతో వేలాది నేతన్నల కుటుంబాలకు మేలు జరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతన్నలతో పాటు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## చేనేత రంగానికి ప్రభుత్వం వరం

### - నేతన్నల మోములో దరహాసం - ఏపీఎస్పీడీసీఎల్‌లో 41వేల మంది వినియోగదారులకు లబ్ధి
### - ప్రభుత్వ సబ్సిడీ ఏటా రూ. 25.56 కోట్లు - ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి వెల్లడి



**తిరుపతి, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్ర సీఎం నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేనేత రంగానికి చేయూతనందిస్తోంది. అల్పాదాయంతో తమ జీవితాలను నెట్టుకొస్తున్న నేతన్నలకు సబ్సిడీ రూపంలో రాష్ట్ర ప్రభుత్వం వరాన్ని ప్రసాదించింది. ప్రభుత్వ నిర్ణయం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు లబ్ధి పొందనున్నాయి. దేశంలో వ్యవసాయం రంగం తర్వాత ఎక్కువగా ఆధారపడే రంగంగా చేనేత రంగం ప్రసిద్ధిగాంచింది. ఈ రంగంలో రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షలకు పైగా నేతన్నల కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. కూటమి ప్రభుత్వ ప్రోత్సాహంతో రాష్ట్రంలో చేనేత రంగం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. నేతన్నల కుటుంబాల్లో వెలుగులు నింపేలా కూటమి ప్రభుత్వం కీలకమైన పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ యేడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం అమలులోకి వచ్చింది. మగ్గంపై వస్త్రాలు నేసే నేతన్నలకు నెలకు 200 యూనిట్లు, పవర్ లూమ్ మగ్గాల నేతన్నలకు నెలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును సరఫరా చేయడం జరుగుతుంది. సంస్థ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్య సాయి జిల్లాల్లో 29,075 హ్యాండ్ లూమ్స్ సర్వీసులు, 11,971 పవర్ లూమ్స్ సర్వీసులు ఉన్నాయి. మొత్తం మీద ఈ పథకం ద్వారా ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో 41,046 మంది నేతన్నలు విద్యుత్ బిల్లుల కోసం యేడాదికి చెల్లించాల్సిన రూ. 25.56 కోట్లు మొత్తాన్ని సబ్సిడీ రూపంలో రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. సంస్థ పరిధిలో నేతన్నల విద్యుత్ సర్వీసులకు మెరుగైన సేవలందించేందుకు ఏపీఎస్పీడీసీఎల్ కృషి చేస్తోంది. నేతన్నల విద్యుత్ సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతోంది. మగ్గాలు, పవర్ లూమ్స్ ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ లోడ్ కు అనుగుణంగా ట్రాన్స్ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడం, విద్యుత్ సర్వీసులకు కెపాసిటర్ల ఏర్పాటు తదితర అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించడం జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలు అనుగుణంగా నేతన్నల అభివృద్ధే లక్ష్యంగా ఏపీఎస్పీడీసీఎల్ కృషి చేస్తోంది.

## కుట్రలు ఛేదించిన అమరావతి చట్టం : నెలవల విజయశ్రీ



**సూళ్లూరుపేట, ఏప్రిల్ 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సూళ్ళూరుపేట, అమరావతి రాజధాని ఆంధ్రుల హక్కు అని విజయశ్రీ అన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఆమె పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి పార్లమెంటులో చట్టబద్ధత లభించిన నేపథ్యంలో ఆంధ్రులు హక్కు అమరావతి రైతుల కష్టం పలించిందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు ఆనందోత్సాహాల మధ్య వేడుకలు జరుపుకున్నారు. రాష్ట్రంలో చీకట్లు తొలిగి వెలుగులు వచ్చినట్లుగా సూచిస్తూ, ఆనంద జ్యోతుల పేరిట స్కై లాంతర్లను గాలిలోకి వదిలారు. ర్యాలీలు నిర్వహించారని ఆమె తెలియజేశారు. అమరావతి రాజధానిగా చట్టబద్ధత కల్పించిన సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ తో పాటు ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మొదటి నుంచి ఒకే రాజధాని నిర్ణయానికి నిబద్ధతతో కట్టుబడి ఉన్న ఏకైక నాయకుడు చంద్రబాబు మాత్రమేనని ఆమె స్పష్టం చేశారు. అమరావతిని రాజధానిగా నిర్మిస్తూనే, విశాఖను ఆర్థిక రాజధానిగా, రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్ది అన్ని ప్రాంతాల సమ్మిళిత వృద్ధికి అప్పట్లోనే చంద్రబాబు రూపకల్పన చేశారని గుర్తు చేశారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027